తెలుగుకలం

TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

అనంతపురం | కర్నూలు | కడప | చిత్తూరు | ప్రకాశం | గుంటూరు | విజయవాడ | హైదరాబాద్

సంపుటి : 01 సంచిక : 84 ఎడిటర్. అచుకట్ల ఖాదర్ బాషా పేజిలు : 08 మంగళవారం 27 - 10 - 2026వెల రూ. 2 రూ/

ప్రతికూల ప్రభావం లేకపోతే
తుమ్మిడిహెట్టికి ఓకే

- మహారాష్ట్ర సీఎం సానుకూలం!
- తుమ్మిడిహెట్టిపై తెలంగాణ, మహారాష్ట్ర ముఖ్యమంత్రుల సమావేశం
- ప్రతికూల ప్రభావం లేకపోతే ఓకే
- తుమ్మిడిహెట్టిపై మహారాష్ట్ర సీఎం సానుకూలం!
- తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై ముంబయిలో చర్చలు జరిగాయి
- 152 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి అంగీకారం తెలపాలని సీఎం రేవంత్‌రెడ్డి మహారాష్ట్రను కోరారు



హైదరాబాద్ :

తుమ్మిడిహెట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి సంబంధించిన అంశంపై ముంబయి వేదికగా తెలంగాణ, మహారాష్ట్ర ముఖ్యమంత్రులు సమావేశం జరిగింది. తెలంగాణ నీటి అవసరాలు, వెనుకబడిన ప్రాంత అభివృద్ధి, గిరిజనుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో ఆనకట్ట నిర్మాణానికి సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్రను కోరారు. తమ రాష్ట్రంపై ప్రతికూల ప్రభావం లేకపోతే తుమ్మిడిహెట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి గతంలో కుదిరిన ఒప్పందాన్ని పునఃపరిశీలించేందుకు తమకు అభ్యంతరం లేదని, తెలంగాణ నీటి అవసరాలకు సహకరిస్తామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు. కేంద్ర జలసంఘం - మిగతా 2 లో

రాహుల్ గాంధీకి రేవంత్ రెడ్డి
ఏటీఎం కార్డులా మారారు



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- రాహుల్ గాంధీకి తెలంగాణ ఒక ఏటీఎంగా మారిందన్న కేటీఆర్
- హామీలు గాలికొదిలి కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తోందని విమర్శ
- సీఎం పాలనలో స్కామ్‌లు, అవినీతి పెరిగిపోయిందని ఆరోపణ
- 2028లో కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని కేటీఆర్ ధీమా వ్యక్తం

హైదరాబాద్ :

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రాహుల్ గాంధీకి ఒక ఏటీఎంగా మారిందని, ముఖ్యమంత్రి - మిగతా 2 లో



అధికారానికి దూరమవడంతో
కాంగ్రెస్‌లో అసహనం

- ప్రధానిపై ఖర్గే వ్యాఖ్యలు
- తీవ్రంగా స్పందించిన రాంచందర్ రావు
- ప్రధాని తండ్రిని ఉద్దేశించి ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు
- తీవ్రంగా ఖండించిన తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు

హైదరాబాద్ :

ప్రధాని మోదీని ఉద్దేశించి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అంతటి సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ నేత ఇంత దిగజారుడు - మిగతా 2 లో



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు శుభవార్త
త్వరలో ఫైనల్ బిల్లులు!

- ఇందిరమ్మ ఇళ్ల పెండింగ్ బిల్లులు త్వరలో జమ
- లబ్ధిదారులు ఆందోళన చెందవద్దన్న మంత్రి పొంగులేటి
- రూ.40 వేల కోట్లతో 8 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యం
- తరువాతి విడతల్లోనూ అర్హులకు ఇళ్ల కేటాయింపు

హైదరాబాద్ :

తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. నిర్మాణం పూర్తిచేసుకుని ఫైనల్ బిల్లుల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి త్వరలోనే ఆ మొత్తాన్ని జమ చేయనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. పాలేరు నియోజకవర్గ పర్యటనలో - మిగతా 2 లో

రూ.2.12లక్షల కోట్లతో
డ్రోన్స్, గన్స్, హెలికాప్టర్స్ కొనుగోలు



- డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ ఆమోదం
- రక్షణ రంగానికి భారీ బూస్ట్
- సరికొత్త హెలికాప్టర్లు, కామికాజ్ డ్రోన్ల కోసం రూ.2.12 లక్షల కోట్లు కేటాయించేందుకు కేంద్రం ఆమోదం
- భారత సైన్యం కోసం ఇతర మానవ రహిత వైమానిక వ్యవస్థలు, నిఘా విమానాలు, సమీకృత నిఘా,దాడి వ్యవస్థలు

ఢిల్లీ :

రక్షణ దళాల కోసం రూ.2.12 లక్షల కోట్ల విలువైన సైనిక పరికరాలు కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సోమవారం ఆమోదం తెలిపింది. దీనితో తేలికపాటి మల్టీ-రోల్ హెలికాప్టర్లు, - మిగతా 2 లో

విజయవాడకు
ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

- ఘన స్వాగతం పలికిన గవర్నర్, మంత్రి లోకేశ్
- ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రూబీ జూబ్లీ వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరు
- ఉపరాష్ట్రపతిని శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందించిన మంత్రి లోకేశ్



అమరావతి :

భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ సోమవారం ఆంధ్రప్రదేశ్ పర్యటనకు విచ్చేశారు. ఆయన ప్రత్యేక విమానంలో విజయవాడ సమీపంలోని గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు ఘనంగా స్వాగతం పలికింది. ఉపరాష్ట్రపతికి రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌తో పాటు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పుష్పగుచ్ఛం అందించి ఆత్మీయంగా ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో గన్నవరం ఎమ్మెల్యే - మిగతా 2 లో

మలేరియా వ్యాక్సిన్
ధర 40 శాతం తగ్గింపు

- మరో 10 లక్షల మంది పిల్లలకు రక్షణ!
- ఒక్క డోసు ధర రూ.600 లోపే
- 2027 ప్రారంభం నుంచి కొత్త ధర అమలు
- మూడేళ్లలో 50 మిలియన్ డాలర్ల ఆదా
- మరో 10 లక్షల మంది పిల్లలకు టీకా అవకాశం
- నాలుగు డోసులతో మలేరియా కేసులు తగ్గే అవకాశం
- ఆఫ్రికా దేశాల్లో వ్యాక్సిన్ పంపిణీకి ప్రాధాన్యం





అవి ఏకగ్రీవాలు కాదు..
కూటమి పార్టీలు చేసిన బలాత్కారాలు

- ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల
- స్థానిక సంస్థల ఏకగ్రీవాలపై షర్మిల ఫైర్
- ఈసీ, పోలీసు వ్యవస్థలను కూటమి నిర్వీర్యం చేసిందని వ్యాఖ్య
- ఏకగ్రీవ ఫలితాలను నిలిపివేసి, విచారణ జరపాలని డిమాండ్

అమరావతి :

రాష్ట్రంలో జరిగిన స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో నమోదైన ఏకగ్రీవాలపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) - మిగతా 2 లో

తిరుపతిలో డీజీపీ, ఐజీల జాతీయ సదస్సు



- హాజరుకానున్న మోదీ, అమిత్ షా
- డిసెంబర్ 4 నుంచి 6 వరకు తిరుపతిలో డీజీపీ, ఐజీల సదస్సు
- హాజరుకానున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- తిరుపతి ఐసర్‌లో జరగనున్న జాతీయ స్థాయి సమావేశం
- ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష

తిరుపతి :

దేశ అంతర్గత భద్రత, శాంతిభద్రతలకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించే వార్షిక సదస్సు ఈసారి తిరుపతిలో జరగనుంది. - మిగతా 2 లో



- ప్రజలకు కీలక సూచనలు
- అర్నబ్ తుపానుపై ఆంధ్రప్రదేశ్ సర్కారు హైఅలర్ట్ ప్రకటించింది
- క్షణక్షణం తుపాను కదలికలపై నిఘా పెట్టి ఎక్కడా ప్రాణనష్టం జరగకుండా పక్కా కార్యాచరణతో ముందుకెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు
- ఆంధ్రప్రదేశ్ తీరం వైపు కదులుతున్న నేపథ్యంలో రెడ్ అలర్ట్ జారీ
- తీరం దాటే సమయంలో గంటకు 140 కి.మీ. వేగంతో పెనుగాలులు
- తుపాను తీవ్రతను స్పష్టం చేసిన ఇస్రో శాటిలైట్ చిత్రాలు

అర్నబ్ తుపానుపై
ఏపీ సర్కార్ హైఅలర్ట్

అమరావతి :

అర్నబ్ తుపానుపై ఆంధ్రప్రదేశ్ సర్కారు హైఅలర్ట్ ప్రకటించింది. క్షణక్షణం తుపాను కదలికలపై నిఘా పెట్టి ఎక్కడా ప్రాణనష్టం జరగకుండా పక్కా కార్యాచరణతో ముందుకెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. తుపాను ప్రభావం, వర్షాలు, గాలులు, వరద ప్రవాహాల తీవ్రతను అంచనా వేస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని స్పష్టం చేశారు. తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తూ, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.అర్నబ్ తుపాను ప్రభావం పై ముఖ్యమంత్రి చంద్రబాబు, వివిధ శాఖల మంత్రులు వరుస సమీక్షలు చేపట్టి, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. తుపాను ముప్పును ఎదుర్కొనేందుకు ముందస్తు సన్నద్ధతే కీలకమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. గతంలో వచ్చిన తుపాన్ల సమాచారాన్ని విశ్లేషించి, ప్రస్తుత పరిస్థితులతో పోల్చుతూ ప్రమాద తీవ్రతను అంచనా వేయాలని సూచించారు. రైతులకు, ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేయాలని, - మిగతా 2 లో

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
మంగళవారం 27 - 10 - 2026

సంపాదకీయం

స్థలకాల సందిగ్ధంలో...

స్థలకాలాలను మనిషి శాసిస్తాడా లేక స్థలకాలాలే మనిషిని శాసిస్తాయా అని అడిగితే ఠక్కున సమాధానం చెప్పడం కష్టం. ఎందుకంటే, సాధారణంగా ఆ అనుశాసనం భార్యా భర్తల సంబంధంలా పరస్పరమవుతుంది; మనిషి స్థలకాలాలను శాసిస్తున్నట్టు కనిపి స్తూనే, స్థలకాలాల శాసనానికి లొంగిపోతూ ఉంటాడు. ఈ క్షణాన ప్రపంచవ్యాప్తంగా అనేక రంగాలలో అదే జరుగుతోంది. ఇంటర్నెట్ వంటి అత్యాధునిక సాంకేతిక సంపత్తి అందుబాటులోకి వచ్చి స్థలకాలాలతో మనిషి సంబంధంలో అనూహ్యమైన వేగమూ, అనేకమైన మార్పులూ తెచ్చి అతణ్ణి అరచేతి బొమ్మలా ఆడిస్తోంది. తను కనిపెట్టిన సాంకేతికత చేతిలో ఒక్కోసారి తనే చిత్తవుతూ మనిషి కళ్ళు తేలేయవలసివస్తోంది. ఎంతమంది గమనించారో కానీ, ఈ అత్యాధునిక సాంకేతికత పుణ్యమా అని కవి, రచయితలతో సహా ఏదో ఒక రచనారంగానికి చెందిన బుద్ధిజీవులందరూ ఈరోజున స్థలకాలసంబంధమైన ఒక సమస్యను ఎదుర్కొంటున్నారు. ఒక రచన ఆక్రమించుకునే జాగాను ఇక్కడ స్థలమనుకుంటే, ఆ రచన పాఠకులు, లేదా శ్రోతలముందుకు రావడానికి పట్టే సమయాన్ని కాలమనుకుందాం. లిపీ, లేఖనం అభివృద్ధి చెందని మౌఖిక సంప్ర దాయపు రోజుల్లో కవీ లేదా కథకుడూ-- శ్రోతలూ ఎదురెదురుగా ఉండేవారు కనుక స్థల కాలసంబంధమైన అంతరాలు ఉండేవికావు. లేఖన సంప్రదాయం వచ్చి, తాళపత్రాల దశను కూడా దాటి కాగితం మీద రాయడమూ, ముద్రించడమూ, ఆపైన పత్రికలూ వచ్చాక కాగితం మీద ఆ రచన ఆక్రమించుకునే నిడివి రూపంలో స్థలమూ, పాఠకులకది చేరే వ్యవధి రూపంలో కాలమూ ప్రముఖంగా అడుగుపెట్టాయి. ఇలాంటి లేఖనసంప్రదాయం తాళపత్రాలతో మొదలుపెట్టి, వందల సంవత్సరాల పాటు కొనసాగిన తర్వాత మళ్ళీ మనం స్థలకాల అంతరాలకు అవకాశం లేని వెనకటి మౌఖిక సంప్రదాయపు రోజులకు చేరుకున్నాం! ఎలాగంటే, ఆ సంప్రదాయంలో కవులూ, కథకులూ తమ రచనను శ్రోతలకు తక్షణమే అందించినట్టుగా ఈరోజున ఇంట ర్నెట్ ఆధారిత సామాజిక మాధ్యమాల్లో రచయితలు తమ రచనలను పాఠకులకు తక్షణమే అందించగలుగుతున్నారు; దానికి తోడు, లేఖన, ముద్రణానుభవాలకుభిన్నంగా ఈ మాధ్యమాల్లో స్థలపరిమితులు కూడా పూర్తిగా మాయమవుతున్నాయి. ఈవిధంగా రచనాకాలచక్రం చిత్రంగా తిరిగి బయలు దేరినచోటికే వచ్చింది! మారిన ఈ పరిస్థితికి అనుగుణంగా తాము మారి, తమ రచనలను ఎలా మలచు కోవాలన్నదే ఈ రోజున ఎంతోమంది రచయితలు అప్రకటితంగా ఎదుర్కొంటున్న సమస్య. ఉదాహరణకే చూడండి, ఆయా రచనాప్రక్రియల్లో చేయి తిరిగినవారిలో అనేకులు నిన్నటివరకూ దిన, వార, మాస పత్రికలు నిర్దేశించిన స్థలకాలపరిమితులకూ, ప్రమాణాలకూ లోబడి రాయడానికి అలవాటుపడినవాళ్ళు; అలాగే తమ రచన పాఠకు లకు చేరేందుకు పట్టే వ్యవధికీ మానసికంగా సిద్ధమై ఉండేవారు. నేరుగా పుస్తకరూపంలో తమ రచనల్ని ముద్రించుకునేవారూ దాదాపు ఈ కోవలోకే వస్తారు.కానీ ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల వ్యాప్తితో స్థలకాలపరిమితులే కాక, ప్రమాణాలను నిర్దేశించుకుని పరిష్కరణ బాధ్యత వహించే సంపాదకవర్గం కూడా మటుమాయమై ప్రతి రచయితా, కవీ, కథకుడూ తన 'గోడ'కు తనే యజమానిగా, సంపాదకుడిగా అదనపు బాధ్యతలను మోయవలసివస్తోంది. రచన చేయడానికే తప్ప పాఠకులకు దానిని చేర్చడానికి పట్టే వ్యవధి క్షణాలకు కుదించుకుపోవడం ఒక సానుకూల పరిణామనుకున్నా, స్థలపరి మితులు మాయమైపోయిన స్థితిలో పాఠకుల సహనమే కొలమానంగా పరిమితులను నిర్ణయించుకోవలసిన బాధ్యతా రచనాకారులపైనే పడుతోంది. అంతేకాదు, పత్రికలవంటి మాధ్యమాలు నిర్దేశించిన చట్రంనుంచి రచనలు తప్పుకుని వస్తురూపాలూ, అభివ్యక్తుల పరంగా కొత్తరూపాలు ధరించడమూ జరుగుతోంది.

విజయవాడకు ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

మొదటిపేజీ తరువాయి - యార్లగడ్డ వెంకట్రావు, పలువురు ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. అనంతరం మంత్రి నారా లోకేశ్ ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌ను శాలువాతో సత్కరించి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒక ప్రత్యేక జ్ఞాపికను బహూకరించారు.విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో జరగనున్న డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 40వ వార్షికోత్సవ (రూబీ జూబ్లీ) వేడుకల్లో ఉపరాష్ట్రపతి ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ కార్యక్రమం ముగిసిన అనంతరం ఆయన మధ్యాహ్నం తిరుపతికి బయలుదేరి వెళ్లనున్నారు.

తిరుపతిలో డీజీపీ, ఐజీల జాతీయ సదస్సు

మొదటిపేజీ తరువాయి - దేశంలోని అన్ని రాష్ట్రాల డీజీపీలు, ఐజీలతో పాటు కేంద్ర పోలీస్ సంస్థల అధిపతులు పాల్గొనే ఈ జాతీయ స్థాయి సమావేశానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరుకానున్నారు. డిసెంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు మూడు రోజుల పాటు తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ప్రాంగణంలో ఈ సదస్సు జరగనుంది.ఈ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహణకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. ఇందులో భాగంగా సోమవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) జి. సాయిప్రసాద్ సంబంధిత శాఖల అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధాని, కేంద్ర హోంమంత్రి సహా దేశంలోని పోలీసు ఉన్నతాధికారులందరూ హాజరవుతున్నందున, భద్రత, వసతి, రవాణా తదితర అంశాల్లో ఎక్కడా ఎలాంటి లోటుపాట్లకు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖ తమకు కేటాయించిన బాధ్యతలను సమన్వయంతో పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు.ఈ సమీక్షా సమావేశంలో హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్, అదనపు డీజీపీ మధుసూదన్ రెడ్డి, జీఏడీ ముఖ్య కార్యదర్శి జె. శ్యామల రావు, ఐపీఎస్ అధికారి కాంతి రాణా టాటా, ఎస్ఐబీ డిప్యూటీ డైరెక్టర్ అంబిక తదితరులు పాల్గొన్నారు. అలాగే, తిరుపతి కలెక్టర్ డా. వెంకటేశ్వర్, ఎస్పీతో పాటు ఇతర అధికారులు వర్చువల్ విధానంలో పాలుపంచుకున్నారు.

రాహుల్ గాంధీకి రేవంత్ రెడ్డి ఏటీఎం కార్డులా మారారు

మొదటిపేజీ తరువాయి - రేవంత్ రెడ్డి ఏటీఎం కార్డులా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో వరుస కుంభకోణాలు, అవినీతి జరుగుతున్నా రాహుల్ గాంధీ మౌనంగా ఉండటానికి కారణం.. ఇక్కడి నుంచి ఆయనకు ముడుపులు అందుతుండటమేనని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన మైనారిటీ నాయకుడు జిబ్రాన్ షరీఫ్, తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు.దేశమంతా తిరుగుతూ 'ఛాత్రోంకీ గూంజ్' అంటూ ఉపన్యాసాలిచ్చే రాహుల్ గాంధీకి తెలంగాణలో అడుగుపెట్టే ధైర్యం లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు 420 హామీలిచ్చి, వెయ్యి రోజులు గడుస్తున్నా వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. "రాహుల్ గాంధీ అడ్రస్ లేకుండా పోయారు. తెలంగాణలో ఏం జరుగుతుందో ఆయనకు పట్టడం లేదు. ఎందుకంటే ఆయనకు అందాల్సినవి అందుతున్నాయి. అందుకే ఇక్కడి స్కామ్‌లపై, ప్రభుత్వ వైఫల్యాలపై నోరు మెదపడం లేదు" అని కేటీఆర్ ఆరోపించారు.ఎన్నికలకు ముందు హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో టీ స్టాల్ వద్ద కూర్చొని నిరుద్యోగ యువతకు ఉద్యోగాల గురించి భరోసా ఇచ్చిన రాహుల్ గాంధీ, ఇప్పుడు వారిని పూర్తిగా విస్మరించారని అన్నారు. మైనారిటీల కోసం ప్రత్యేక డిక్లరేషన్ ప్రకటించి, సంక్షేమానికి రూ. 4,000 కోట్లు కేటాయిస్తామన్న హామీని గాలికొదిలేశారని విమర్శించారు. ఆసరా పెన్షన్‌ను రూ. 4,000కు పెంచుతామని, రైతులకు ఎకరానికి రూ. 15,000 ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి, ఇప్పుడు మాట తప్పారని మండిపడ్డారు.ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సింది పోయి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిట్లతో, అక్రమ కేసులతో బెదిరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి పాలనలో వరుస కుంభకోణాలు వెలుగులోకి వస్తున్నాయని, ముఖ్యంగా ఆయన కుటుంబ సభ్యులకు సంబంధించిన భూ వ్యవహారాలు అనుమానాస్పదంగా ఉన్నాయని అన్నారు. "సుమారు రూ.200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని కేవలం రూ.7 కోట్లకే తన తమ్ముడికి కట్టబెట్టారు. అమెరికాలో ఉంటున్న మరో సోదరుడికి సంబంధించిన రూ.1,000 కోట్ల డీల్‌పై కూడా అనేక అనుమానాలు ఉన్నాయి. వీటిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు వెల్లడించాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య మతపరమైన విభజనలు సృష్టిస్తుంటే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటుందని కేటీఆర్ అన్నారు. దేశంలో ప్రధాని మోదీని ఎదుర్కొనే సత్తా కాంగ్రెస్‌కు లేదని, తెలంగాణ ప్రయోజనాలను కాపాడే ఏకైక శక్తి బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని తెలిపారు. "ఇంకో ఏడాదిన్నరలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం. 2028లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు. తెలంగాణను తిరిగి దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం" అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

అధికారానికి దూరమవడంతో కాంగ్రెస్‌లో అసహనం

మొదటిపేజీ తరువాయి -

భాష మాట్లాడటం అత్యంత విచారకరమని అన్నారు.హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన రాంచందర్ రావు... గత పన్నెండున్నర ఏళ్లుగా అధికారానికి దూరంగా ఉండటంతో కాంగ్రెస్ నేతల్లో తీవ్రమైన అసహనం కనిపిస్తోందని విమర్శించారు. ఆ నిరాశా నిస్పృహల నుంచే మోదీ తండ్రిని కూడా నిందిస్తూ ఖర్గే వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఖర్గే మాట్లాడిన సభలో వేదికపై ఉన్న నేతల కంటే కింద ఉన్న ప్రేక్షకులు చాలా తక్కువగా ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు.బీహార్‌లోని పాట్నాలో నిన్న జరిగిన ఓ కార్యక్రమంలో మల్లికార్జున ఖర్గే ప్రసంగిస్తుండగా... ఓ వ్యక్తి మోదీ ఓడిపోరంటూ నినాదాలు చేశారు. దీనికి స్పందించిన ఖర్గే.. 'మోదీ కా బాప్ భీ జాయేగా' (మోదీ అబ్బ కూడా దిగిపోవాల్సిందే) అంటూ వ్యాఖ్యానించారు.ఈ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా పలువురు బీజేపీ నేతలు ఖర్గే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై పాట్నాలోని పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నేతలు ఫిర్యాదు కూడా చేశారు. దీంతో ఈ వివాదం మరింత ముదిరింది.

అర్నబ్ తుపానుపై ఆంధ్రప్రదేశ్ సర్కార్ హైఅలర్ట్

మొదటిపేజీ తరువాయి - తీర ప్రాంత ప్రజలను తుపాను షెల్టర్లకు తరలించే ప్రక్రియను పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఆర్టీజీఎస్, విపత్తు నిర్వహణ శాఖల అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులు వర్చువల్‌గా హాజరయ్యారు.తుపాను కదలికలు, తీరం దాటే అంచనాలపై హోంమంత్రి అనిత వివరాలు వెల్లడించారు. అర్ధరాత్రికి తుపాను తీవ్రంగా, రేపటికి అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని తెలిపారు. ఎల్లుండి ఉదయం బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశముందని, గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచవచ్చని వివరించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని సూచించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామని, అధికారిక సమాచారాన్ని మాత్రమే అనుసరించాలని స్పష్టం చేశారు. తుపాను కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే పునరుద్ధరణకు వెంటనే చర్యలు చేపట్టాలని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. అవసరమైన సిబ్బందిని, పరికరాలను సిద్ధంగా ఉంచాలని, విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సి వస్తే వినియోగదారులకు ముందుగానే సమాచారం అందించాలని సూచించారు.సాగునీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, నదులు, కాలువల వద్ద నీటి మట్టాలు, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లోలను నిరంతరం పర్యవేక్షించాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. వరద ముప్పున్న ప్రాంతాలను గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలని, నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించాలని సూచించారు. ఎన్టీఆర్ జిల్లాలోని బుడమేరు కాలువ, ఏలేరు రిజర్వాయర్ పరివాహక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పనులకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ పద్ధతుల్లో పనులు కొనసాగిస్తూ, 2027 మార్చి నాటికి పూర్తి చేసే లక్ష్యంతో ముందుకెళ్లాలని స్పష్టం చేశారు. రహదారులపై చెట్లు కూలినా, రాకపోకలకు అంతరాయం కలిగినా వెంటనే స్పందించేలా యంత్రాంగాన్ని సిద్ధం చేయాలని ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. ప్రమాదకర వంతెనలు, కల్వర్టుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని, అవసరాన్ని బట్టి ట్రాఫిక్‌ను నియంత్రించాలని సూచించారు. ఇంజినీరింగ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, కలెక్టర్లు, పోలీసులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. సంబంధిత అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.పంట నష్టాన్ని తగ్గించేందుకు రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. వాతావరణం అనుకూలించినప్పుడు కోతకు సిద్ధంగా ఉన్న వరి, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ, మినుము, పెసర, కంది పంటలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. ధాన్యం, ఇతర వ్యవసాయ ఉత్పత్తులపై టార్పాలిన్లు కప్పాలని, పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా మురుగు కాలువలను శుభ్రం చేయాలని ఆదేశించారు. వర్షాలు పడే సమయంలో యూరియా, పైపాటుగా వేసే ఎరువుల వినియోగాన్ని వాయిదా వేయాలని స్పష్టం చేశారు. ఉద్యాన పంటలకు నష్టం కలగకుండా అరటి, బొప్పాయి మొక్కలకు ఆసరా ఏర్పాటు చేయాలని, పందిరి పంటల నిర్మాణాలను బలోపేతం చేయాలని అచ్చెన్నాయుడు సూచించారు. పశువులు, కోళ్లు ఉండే షెడ్లలోకి నీరు చేరకుండా చూడాలని, ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, మోటార్లు, డ్రిప్ పరికరాలను సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలని తెలిపారు. తుపాను తర్వాత పంటలకు తెగుళ్లు, వ్యాధులు సోకకుండా వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు.తుపాను వేళ ప్రజలు విద్యుత్ స్తంభాలు, తెగిపడిన తీగలు, చెట్లు, హోర్డింగులు, బలహీనమైన భవనాలకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించేవారు అధికారుల సూచనల మేరకు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా ఉండటంతో పాటు ఇప్పటికే సముద్రంలో ఉన్న బోట్లు సురక్షిత తీరానికి చేరుకోవాలని హెచ్చరించారు. తుపాను అనంతరం పంటలు, పశువులు, వ్యవసాయ పరికరాలకు జరిగిన నష్టాన్ని నమోదు చేసి సంబంధిత అధికారులకు తెలియజేయాలని, బీమా క్లెయిమ్‌లకు అవసరమైన ఆధారాలను భద్రపరచుకోవాలని సూచించారు. తాగునీటిని కాచి చల్లార్చి తీసుకోవాలని, అన్ని వేళలా ప్రాణ రక్షణకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

అవి ఏకగ్రీవాలు కాదు.. కూటమి పార్టీలు చేసిన బలాత్కారాలు

మొదటిపేజీ తరువాయి - అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇవి ప్రజల ఆమోదంతో జరిగిన ఏకగ్రీవాలు కావని, అధికార మదంతో కూటమి పార్టీలు చేసిన బలాత్కారాలని ఆమె ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆమె సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. అధికార కూటమి అరాచకాలకు ఈ ఏకగ్రీవాలు నిదర్శనమని, ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని తీవ్రంగా విమర్శించారు.షర్మిల తన ప్రకటనలో, "రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను 'కూటమి కమిషన్'గా మార్చారు. నడిరోడ్డుపై రాజ్యాంగాన్ని ఖూనీ చేసి, పోలీసు వ్యవస్థను బానిసగా మార్చి, ప్రతిపక్ష అభ్యర్థుల పత్రాలు చించివేసి, వారిని భయభ్రాంతులకు గురిచేశారు. రక్తపాతంతో ప్రజాస్వామ్యాన్ని కాలరాసిన ఘనత కూటమి పార్టీలది" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో 16 మున్సిపాలిటీలు, 639 వార్డులు, 4 జెడ్పీటీసీలు, 32 ఎంపీటీసీ స్థానాల్లో జరిగినవి ఏకగ్రీవాలు కాదని, కూటమి సృష్టించిన భయోత్పాతానికి నిదర్శనాలని ఆమె అన్నారు. ఇది ప్రభంజనం కాదని, కూటమి రాజకీయ నిస్తేజమని అభివర్ణించారు.గత వైసీపీ ప్రభుత్వంతో పోలుస్తూ షర్మిల, కూటమి ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. "ఆనాడు వైసీపీ చేసిందని నేడు మీరు చేస్తారా? వాళ్లు గడ్డి తిన్నారని, మీరు అదే తింటారా? కూటమి ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం లేదా? బలవంతపు ఏకగ్రీవాల పేరుతో ఈ విచక్షణా రాహిత్యం ఎందుకు?" అని ఆమె ప్రభుత్వాన్ని నిలదీశారు.ఈ బలవంతపు ఏకగ్రీవాలపై రాష్ట్ర ఎన్నికల సంఘం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పక్షాన షర్మిల డిమాండ్ చేశారు. ఏకగ్రీవాల ఫలితాలను నిలిపివేసి, పూర్తిస్థాయిలో విచారణ జరపాలని కోరారు. ఈ విషయంలో ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించి ప్రజల హక్కులను కాపాడాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

రూ.2.12లక్షల కోట్లతో డ్రోన్స్, గన్స్, హెలికాప్టర్స్ కొనుగోలు

మొదటిపేజీ తరువాయి - లాంగ్-రేంజ్ కామికాజ్ డ్రోన్లు సహా సైనిక ప్లాట్‌ఫారమ్‌లు, ఆయుధాలు కొనుగోలు చేసేందుకు వీలవుతుంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన డీఏసీ (డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్) ఈ కొనుగోలు ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది.రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకారం, భారత సైన్యం కోసం హై మొబిలిటీ వాహనాలు, సెల్ఫ్-ప్రొపెల్డ్ ట్రాక్డ్‌గన్ సిస్టమ్, తేలికపాటి మల్టీ-రోల్ హెలికాప్టర్లు, స్వల్ప శ్రేణి వాయు రక్షణ వ్యవస్థ, కౌంటర్ అన్‌మ్యాన్డ్ ఏరియల్ సిస్టమ్ (సీ-యూఏఎస్) కొనుగోలుకు ఆమోదం లభించింది. అలాగే భారత సైన్యం కోసం ఇతర మానవ రహిత వైమానిక వ్యవస్థలు, నిఘా విమానాలు, సమీకృత నిఘా, దాడి వ్యవస్థలు, లాంగ్-రేంజ్ కామికాజీ డ్రోన్ వ్యవస్థలు కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. మరోవైపు భారత నౌకాదళం కోసం యాక్టివ్ ఆఫ్‌బోర్డ్ డెకాయ్ సిస్టమ్ ఇతర ప్రధాన నౌకాదళ ప్లాట్‌ఫారమ్‌ల కొనుగోలుకు కూడా ఆమోదం లభించింది. అలాగే భారత వైమానిక దళం కోసం హెలికాప్టర్లు, వాయు రక్షణ వ్యవస్థలు, రాడార్ల సేకరణకు డీఏసీ ఆమోదం తెలిపింది. కాగా, ఈ రక్షణ పరికరాల్లో దాదాపు 82 శాతం భారత పరిశ్రమల నుంచే కొనుగోలు చేయనున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు శుభవార్త.. త్వరలో ఫైనల్ బిల్లులు!

మొదటిపేజీ తరువాయి - భాగంగా ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఇల్లు పూర్తయినా ఫైనల్ బిల్లు ఇంకా రాలేదని లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు.రాష్ట్రంలోని నిరుపేదలకు పక్కా గృహాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షల ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున, మొత్తం రూ.40 వేల కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రభుత్వం కేటాయించిందని పేర్కొన్నారు.మొదటి విడతలో ఇళ్ల మంజూరు కాని అర్హులైన పేదలు నిరాశ చెందవద్దని మంత్రి పొంగులేటి సూచించారు. ప్రభుత్వం దశలవారీగా ఈ పథకాన్ని అమలు చేస్తుందని, మూడు, నాలుగో విడతల్లో కూడా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి ప్రకటనతో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని, తుది చెల్లింపుల కోసం ఎదురుచూస్తున్న వేలాది పేద కుటుంబాల్లో ఆశలు చిగురించాయి. త్వరలోనే తమ ఖాతాల్లోకి డబ్బులు జమ అవుతాయన్న నమ్మకం వారిలో వ్యక్తమవుతోంది.

మలేరియా వ్యాక్సిన్ ధర 40 శాతం తగ్గింపు

మొదటిపేజీ తరువాయి - మలేరియా మహమ్మారి నుంచి చిన్నారులను రక్షించేందుకు భారత్ బయోటెక్ కీలక ముందడుగు వేసింది. అంతర్జాతీయ సంస్థలు 'గవి', 'యునిసెఫ్'తో కలిసి మలేరియా వ్యాక్సిన్ ధరను దాదాపు 40 శాతం తగ్గించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో ప్రస్తుతం ఒక్క డోసుకు 9.30 యూరోలుగా ఉన్న ధర 5.50 యూరోలకు తగ్గనుంది. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.600 లోపే ఉంటుంది. ఈ తగ్గింపు 2027 ప్రారంభం నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. ఈ నిర్ణయంతో 2027-2029 మధ్య చిన్నారుల టీకా కార్యక్రమాలకు దాదాపు 50 మిలియన్ డాలర్లు ఆదా కానున్నాయి. ఈ నిధులతో మరో 10 లక్షల మంది పిల్లలకు మలేరియా వ్యాక్సిన్ అందించవచ్చని అంచనా. భారత్ బయోటెక్ ఈ వ్యాక్సిన్‌ను 'మాస్వివాక్' పేరుతో తయారు చేస్తోంది. దీని అసలు పేరు ఆర్టీఎస్, ఎస్/ఏఎస్01. జీఎస్‌కే, పాత్ సంస్థలు, వాటి భాగస్వాములు అభివృద్ధి చేసిన ఈ వ్యాక్సిన్‌ను 2021లో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) చిన్నారుల్లో మలేరియా నివారణ కోసం విస్తృత వినియోగానికి సిఫారసు చేసింది. ప్రస్తుతం దీని తయారీ బాధ్యతలను జీఎస్‌కే నుంచి భారత్ బయోటెక్‌కు బదిలీ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచి, మరిన్ని దేశాలకు వ్యాక్సిన్ అందుబాటులోకి తీసుకురావడం దీని ప్రధాన లక్ష్యం.ఈ వ్యాక్సిన్‌ను నాలుగు డోసుల కోర్సుగా ఇస్తారు. మలేరియా వ్యాప్తి కాలానుగుణంగా ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సరైన సమయంలో నాలుగు డోసులు తీసుకుంటే మలేరియా కేసులు సుమారు 75 శాతం తగ్గే అవకాశం ఉందని యునిసెఫ్ తెలిపింది. అయితే, ఈ వ్యాక్సిన్ పూర్తిస్థాయి రక్షణ ఇవ్వదు. దోమతెరలు వాడటం, దోమల నియంత్రణ చర్యలు చేపట్టడం, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం కూడా అవసరం.ప్రపంచవ్యాప్తంగా 2024లో సుమారు 28.2 కోట్ల మలేరియా కేసులు నమోదయ్యాయి. ఈ వ్యాధితో 6.10 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో అత్యధిక మరణాలు ఆఫ్రికాలోనే సంభవించాయి. ఆ ప్రాంతంలో ఐదేళ్లలోపు చిన్నారులే ఎక్కువగా మృత్యువాత పడుతున్నారు. ప్రస్తుతం 25 ఆఫ్రికా దేశాల్లో సాధారణ టీకా కార్యక్రమాల్లో మలేరియా వ్యాక్సిన్‌ను చేర్చారు. యునిసెఫ్ ఇప్పటివరకు 7.4 కోట్లకు పైగా డోసులను సేకరించి పంపిణీ చేసింది.

ప్రతికూల ప్రభావం లేకపోతే తుమ్మిడిహెట్టికి ఓకే

మొదటిపేజీ తరువాయి - అధ్యయనంతో పాటు రెండు రాష్ట్రాల అధికారులతో కూడిన కమిటీ అన్ని అంశాలను పరిశీలించాలని ప్రతిపాదించారు. ముంపు, ప్రభావిత ప్రాంతానికి సంబంధించి ప్రత్యామ్నాయాలను కూడా అధ్యయనం చేయాలని సూచించారు.తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో ఆనకట్ట నిర్మాణానికి సంబంధించిన అంశాలపై ముంబైలోని సహ్యాద్రి స్టేట్ గెస్ట్ హౌస్ వేదికగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ బృందం సమావేశమైంది. రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, రెండు రాష్ట్రాల ప్రధాన కార

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
మంగళవారం 27 - 10 - 2026

నరసాపురం చెక్‌పోస్టు వద్ద

రూ. 6 కోట్ల విలువైన బంగారం పట్టివేత!



నరసాపురం (తెలుగు కలం) అక్టోబర్ 26 : ప్రతినిధి : పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం సమీపంలోని రుస్తుంబాద చెక్‌పోస్టు వద్ద పోలీసులు సోమవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో భారీగా అక్రమ బంగారు ఆభరణాలు పట్టుబడ్డాయి. విజయవాడ నుంచి నరసాపురం వైపు వస్తున్న 'ఏపీ 39 యూవీ 7424' **(AP 39 UV 7424)** నంబరు గల స్విఫ్ట్ డిజైర్ కారును అడ్డుకుని సోదాలు చేయగా, అందులో రవాణా చేస్తున్న సుమారు 3.6 కిలోల బంగారు ఆభరణాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో వీటి విలువ దాదాపు రూ. 6 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇంత పెద్దమొత్తంలో విలువైన పసిడి ఆభరణాలు లభించడంతో పోలీసులు ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. పట్టుబడిన బంగారానికి సంబంధించి ఎలాంటి సరైన బిల్లులు కానీ, రవాణా అనుమతి పత్రాలు కానీ లేకపోవడంతో సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ బంగారాన్ని ఎక్కడి నుంచి తీసుకువస్తున్నారు? ఎవరికి అందజేసేందుకు తరలిస్తున్నారు? అనే వివరాలపై సీఐ ఆకులు రఘు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి లోతుగా విచారణ చేపడుతున్నారు. పోలీసుల విచారణ పూర్తయిన తర్వాత ఈ అక్రమ రవాణాకు సంబంధించిన పూర్తి సమాచారం వెల్లడయ్యే అవకాశం ఉంది.

మాచవరంలో గ్యాస్ లీకేజీ ముమ్మరంగా

సహాయక చర్యలు, అప్రమత్తమైన అధికార యంత్రాంగం



అంబాజీపేట (తెలుగు కలం) అక్టోబర్ 26 : ప్రతినిధి : డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మాచవరం గ్రామంలో తీవ్ర కలకలం రేగింది. గ్రామంలోని ఒక వరి చేను గుండా వెళుతున్న సహజ వాయువు (గ్యాస్) పైప్‌లైన్ నుంచి అకస్మాత్తుగా గ్యాస్ లీకేజీ కావడంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. లీకేజీ ధాటికి గ్యాస్ తీవ్ర ఒత్తిడితో బయటకు రావడం, చుట్టుపక్కల ప్రాంతమంతా గ్యాస్ వాసన వ్యాపించడంతో పొలాల్లో ఉన్న రైతులు, సమీపంలో ఉన్న గ్రామస్తులు ఆందోళనతో సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. ?సమాచారం అందుకున్న వెంటనే జిల్లా అధికార యంత్రాంగం అత్యంత వేగంగా స్పందించి అప్రమత్తమైంది. సంఘటనా స్థలానికి అగ్నిమాపక సిబ్బంది, ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్జీసి) సాంకేతిక నిపుణులు, పోలీసులు వెంటనే చేరుకున్నారు. ప్రమాద తీవ్రతను నివారించేందుకు అగ్నిమాపక సిబ్బంది ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడతుండగా, ఓఎన్జీసి అధికారులు లీకేజీని అదుపులోకి తెచ్చేందుకు, పైప్‌లైన్ కనెక్షన్‌ను సురక్షితంగా మూసివేసేందుకు సాంకేతిక పనులు వేగవంతం చేశారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ స్పందిస్తూ గ్రామస్తులు ఎవరూ ఆందోళన చెందవద్దని కోరారు. పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని, ప్రజల భద్రతకు అవసరమైన అన్ని రక్షణ చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. ఎటువంటి అసౌకర్యం లేదా ప్రమాదం జరగకుండా స్థానిక అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని, పరిస్థితి త్వరలోనే పూర్తిగా అదుపులోకి వస్తుందని వెల్లడించారు. అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టడంతో గ్రామస్తులు ఉపశమనం పొందారు.

పీ. గన్నవరం జనసేనలో అసంతృప్తి జ్వాలలు

కొండేటి చిట్టిబాబు కుమార్తెకు జెడ్పీ చైర్మన్ పదవిపై పార్టీ శ్రేణుల అభ్యంతరం



పీ. గన్నవరం (తెలుగు కలం) అక్టోబర్ 26 : ప్రతినిధి : పి. గన్నవరం నియోజకవర్గ జనసేన పార్టీలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. నిరంతరం పార్టీ కోసం శ్రమించి, క్షేత్రస్థాయిలో కష్టపడిన నిజమైన కార్యకర్తలను, నాయకులను విస్మరించి ఇతరులకు పదవులు కట్టబెట్టడం సరికాదని జనసేన నాయకులు, జనసైనికులు అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పి. గన్నవరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక జనసేన నాయకులు మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కుమార్తెకు జిల్లా పరిషత్ చైర్మన్ (జెడ్పీ చైర్మన్) పదవిని కేటాయించాలనే ప్రతిపాదనపై జనసేన అధిష్టానం వెంటనే పునరాలోచన చేయాలని స్పష్టంగా డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పనిచేసిన కార్యకర్తల మనోభావాలను దెబ్బతీసేలా అధిష్టానం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం తగదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీని నమ్ముకుని కష్టపడిన నాయకులకు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోతే భవిష్యత్తులో పార్టీ తీవ్రంగా దెబ్బతినే పరిస్థితులు ఏర్పడతాయని హెచ్చరించారు. ఇప్పటికైనా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఈ వివాదంపై తక్షణమే దృష్టిసారించాలని, స్థానిక నాయకులు మరియు కార్యకర్తల అభిప్రాయాలను గౌరవిస్తూ సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

శ్రీ మహర్షి వాల్మీకికి ఘన

నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



అనంతపురం (తెలుగు కలం) అక్టోబర్ 26 : శ్రీ మహర్షి వాల్మీకి జయంతోత్సవం సందర్భంగా సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో మహర్షి వాల్మీకి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ ఏ.మలోల పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ, మానవాళికి రామాయణం లాంటి మహత్తరమైన గ్రంథాన్ని అందించిన మహానుభావుడు శ్రీ మహర్షి వాల్మీకి అని కొనియాడారు. మహర్షి వాల్మీకి ప్రపంచానికి అందించిన రామాయణ కావ్యం యుగాలు గడుస్తున్నా మానవ జీవన మార్గదర్శకానికి, ఆదర్శవంతమైన సమాజ నిర్మాణానికి ఎంతగానో ఉపయోగపడుతోందని తెలిపారు. ఆయన చూపిన సన్మార్గంలో మనమందరం పయనించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిసి కార్పొరేషన్ ఈడి సుబ్రహ్మణ్యం, బిసి వెల్ఫేర్ హెచ్డబ్ల్యూఓ మస్తాన్ లతో పాటు పలు శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు గుడ్ న్యూస్ ఎన్నికల కోడ్ వేళ

సదరం స్లాట్ల విడుదలకు ఎన్నికల సంఘం గ్రీన్ సిగ్నల్



AP STATE ELECTION COMMISSION
1st Floor, New HODs Building, M.G. Road, Vijayawada – 520010

Anil Chandra Punetha, IAS (Retd),
State Election Commissioner.

Off: 0866-2970023/24
Email: secy.apsec2@gmail.com
Website: www.sec.ap.gov.in

Lr.Rc.No.1158/SEC-F1/2026, Dt: 24-10-2026

To,
The Secretary to Government,
Health, Medical & Family Welfare Department,
A.P. Secretariat, Amaravati.

Madam,

SUB: APSEC – Vijayawada – 2nd Ordinary Elections to Local Bodies in Andhra Pradesh, 2026 – Release of regular SADAREM slots for conducting disability assessment camps for Persons with Disabilities (PwDs) during MCC in force - Clarification - Sought - Clarification - Issued - Reg.

REF: Lr.No.01-DSH-11/105/2026-GENL-ESTT-APVVP, Dt: 22.10.2026 from the Secretary to Govt., Health, Medical & Family Welfare Department, A.P. Secretariat, Amaravati addressed to APSEC, VIA.

I invite your attention to the subject and reference cited.

తిరుపతి (తెలుగు కలం) అక్టోబర్ 26 : ప్రతినిధి : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అమల్లో ఉన్నప్పటికీ, దివ్యాంగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. దివ్యాంగులకు వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు వీలుగా సదరం **(SADAREM)** స్లాట్లను విడుదల చేసుకునేందుకు సమ్మతి తెలుపుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రత్యేక అనుమతి మంజూరు చేసింది. ?ఈ నిర్ణయానికి సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అక్టోబర్ 24న ప్రభుత్వ ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖకు అధికారిక లేఖ జారీ చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా సదరం సేవలు నిలిచిపోతే దివ్యాంగులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని, వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అలాగే సంబంధిత సేవలు నిరంతరం పొందేందుకు అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో వైకల్య సర్టిఫికెట్లు అందాలనే ఉద్దేశంతోనే ఈ మినహాయింపు ఇచ్చినట్లు కమిషనర్ తన లేఖలో పేర్కొన్నారు. ?అయితే, ఈ స్లాట్ల కేటాయింపు మరియు వైకల్య నిర్ధారణ పరీక్షల ప్రక్రియ మొత్తంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉల్లంఘించకూడదని, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు ఉత్తర్వుల ప్రతులను రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లకు, జిల్లా ఎన్నికల అధికారులకు పంపిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

రాష్ట్రంలో మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యానికే అవమానం

మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆగ్రహం



ప్రొద్దుటూరు (తెలుగు కలం) అక్టోబర్ 26 :ప్రతినిధి : ప్రొద్దుటూరు మున్సిపాలిటీ ఎన్నికల ప్రక్రియపై వైఎస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అధికారులు, పోలీసులు, అధికార పక్షం ముగ్గురూ కుమ్మక్కై ప్రజాస్వామ్యాన్ని తీవ్రంగా పరిహాసం చేశారని ఆయన మండిపడ్డారు. 116 సంవత్సరాల ప్రొద్దుటూరు పురపాలక సంఘ సుదీర్ఘ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అక్రమ రీతిలో ఏకగ్రీవాలు జరిపించారని ధ్వజమెత్తారు. వైఎస్సార్సీపీకి చెందిన 16 మంది కౌన్సిలర్ అభ్యర్థులను నామినేషన్ వేయనివ్వకుండా అడ్డుకున్నారని, కనీసం స్క్రూటినీ ప్రక్రియకు కూడా రానివ్వకుండా దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల అధికారుల తీరుపై మండిపడుతూ "చివరకు నా భార్య నామినేషన్ ఒక్కటే చెల్లుతుందంట" అని రాచమల్లు ఎద్దేవా చేశారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో వైఎస్సార్సీపీ తరఫున వేసిన 88 నామినేషన్లలో ఏకంగా 86 స్థానాలను తిరస్కరించారని వెల్లడించారు. కేవలం 39వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి రమాదేవి నామినేషన్తో పాటు రాజుపాలెం జడ్పీటీసీ అభ్యర్థి నామినేషన్లను మాత్రమే అధికారులు ఆమోదించారని తెలిపారు. వెనుకబడిన వర్గాలకు (బీసీలకు) దక్కాల్సిన చైర్మన్ పీఠాన్ని ఓసీ అభ్యర్థికి దక్కేలా చేయడం వెనుక వరదరాజుల రెడ్డి కుట్ర పన్ని సఫలమయ్యారని ఆరోపించారు. ఎన్నికల అధికారులు, పోలీసులు మరియు వరదరాజుల రెడ్డి వర్గం కలసి తీవ్రమైన తప్పు చేశారని ఆయన దుయ్యబట్టారు. ఒకవైపు ఈ ఆక్రమాలపై వైఎస్సార్సీపీ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తే, మరోవైపు జిల్లా కలెక్టర్ మాత్రం ప్రొద్దుటూరులో ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ విజయంపై వ్యాఖ్యానిస్తూ "ఈ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ ఓడిపోలేదు, టీడీపీ గెలవలేదు.. కేవలం ప్రజలే ఓడిపోయారు" అని వ్యాఖ్యానించారు. గెలుపు డిక్లరేషన్ పత్రాలు తీసుకుంటున్న సమయంలో టీడీపీ నేతల ముఖాల్లో ఎలాంటి కిక్కు లేదని, ఎన్నికల ప్రక్రియ అంతా అధికారులే చూసుకోవడంతో వారికే ఆ కిక్ వచ్చిందని సెటైర్లు వేశారు. ప్రజలు ఓటేసి గెలిపిస్తే నాయకులవుతారని, అదే పోలీసులు గెలిపిస్తే రౌడీలవుతారని ఆయన వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో బీజేపీ నేత ఆదినారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తూ, "నేను కాదు నా భాష మార్చుకోవాల్సింది, ముందుగా మీరు మీ బుద్ధి మార్చుకోండి" అని రాచమల్లు శివప్రసాదరెడ్డి గట్టిగా హితవు పలికారు.

అల్లూరి సీతారామరాజు జిల్లాలో తీవ్ర తుఫాను హెచ్చరికల నేపథ్యంలో ముమ్మర ఏర్పాట్లు



పాడేరు (తెలుగు కలం) అక్టోబర్ 26 : ప్రతినిధి : తీవ్ర తుఫాను హెచ్చరికల నేపథ్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో చేపట్టాల్సిన ముందస్తు జాగ్రత్తలు మరియు రక్షణ చర్యలపై జిల్లా కలెక్టర్ శ్రీమతి టి. నిషాంతి సోమవారం జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శ్రీ ఆదిత్య వర్మ, జాయింట్ కలెక్టర్ శ్రీమతి తిరుమణి శ్రీపూజతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శ్రీ ఆదిత్య వర్మ మాట్లాడుతూ, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను ముందుగానే గుర్తించి, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను, రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాల్లో నివసించే ప్రజలను అప్రమత్తం చేస్తూ, ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ శ్రీమతి తిరుమణి శ్రీపూజ మాట్లాడుతూ, తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఆహార నిల్వలను సిద్ధంగా ఉంచాలని, అత్యవసర పరిస్థితుల్లో ఆహార సరఫరాకు అంతరాయం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి టి. నిషాంతి స్పష్టం చేశారు. తుఫాను విధులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి అవసరమైన రెయిన్‌కోట్లు, శాటిలైట్ ఫోన్లు, ఇతర అత్యవసర సామగ్రిని అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో సైతం సమాచార వ్యవస్థకు అంతరాయం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రోగులు, గర్భిణీ స్త్రీల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అత్యవసర వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది, మందులు, అంబులెన్సులు సిద్ధంగా ఉంచాలని సూచించారు. జిల్లా, మండల స్థాయిల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ల ద్వారా 24 గంటల పాటు పరిస్థితులను పర్యవేక్షించాలని, తుఫానుకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు అధికారుల సూచనలు పాటిస్తూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆమె కోరారు.

అమలాపురంలో ఆర్నాబ్ తుఫాన్ ముందస్తు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు!



అమలాపురం (తెలుగు కలం) అక్టోబర్ 26 : ప్రతినిధి : అర్నబ్ తుఫాన్ ప్రభావం నేపథ్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు. కలెక్టర్ డా.ఆర్.మహేష్ కుమార్ ఆదేశాలు. ప్రజలకు అందుబాటులో ఉండేలా జిల్లా,నియోజకవర్గ స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసిన జిల్లా కలెక్టర్ డా.ఆర్.మహేష్ కుమార్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఆర్నాబ్ తుఫాన్ ప్రభావం నేపథ్యంలో ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా కలెక్టర్ డా.ఆర్.మహేష్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టరేట్‌తో పాటు అమలాపురం, రామచంద్రపురం, కొత్తపేట నియోజకవర్గాల పరిధిలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. తుఫాన్ ప్రభావంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా, అత్యవసర పరిస్థితులు తలెత్తినా సంబంధిత కంట్రోల్ రూమ్‌లను సంప్రదించి సమాచారం అందించాలని అధికారులు సూచించారు. ప్రజల నుంచి అందే సమాచారంపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి అవసరమైన సహాయక చర్యలు చేపట్టేలా ఏర్పాట్లు చేశారు. కంట్రోల్ రూమ్‌ల ఫోన్ నంబర్లు

క్రమ సంఖ్య, కంట్రోల్ రూమ్, ఫోన్ నంబర్

1। జిల్లా కలెక్టరేట్, కోనసీమ। 08856-293104 2। ఆర్డీఓ కార్యాలయం, అమలాపురం। 08856-2332083। ఆర్డీఓ కార్యాలయం, రామచంద్రపురం। 08857-245166 4। ఆర్డీఓ కార్యాలయం, కొత్తపేట। 8500238258 5। ఆర్డీఓ కార్యాలయం, కొత్తపేట। 08855-244299 తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు జారీ చేసే సూచనలు, హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో సమీపంలోని కంట్రోల్ రూమ్‌ను సంప్రదించి సహాయం పొందాలని అధికారులు విజ్ఞప్తి చేసిన జిల్లా కలెక్టర్ డా.ఆర్.మహేష్ కుమార్.

మున్సిపల్ ఎన్నికల వేళ ధర్మవరంలో పోలీసుల మొబైల్ ర్యాలీ

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక





ధర్మవరం (తెలుగు కలం) అక్టోబర్ 26 : ప్రతినిధి : శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం పట్టణంలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలను పరిరక్షిస్తూ, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసులు సోమవారం భారీ మొబైల్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, డీఎస్పీ బి.వి. జగన్నాథ్ రాజు పర్యవేక్షణలో వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప, టూటౌన్ సీఐ జయ నాయక్ పోలీసు సిబ్బందితో కలిసి పట్టణ వీధుల్లో ఈ ర్యాలీ చేపట్టారు. ?ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా రాజకీయ పార్టీల నాయకులు, పోటీ చేస్తున్న అభ్యర్థులు మరియు ప్రజలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని (ఎంసీసీ) తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. పట్టణంలో సెక్షన్ 144, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ లేదా సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించరాదని తేల్చిచెప్పారు. నిషేధాజ్ఞలు అమల్లో ఉన్న సమయంలో నిబంధనలకు విరుద్ధంగా గుంపులుగా గుమిగూడటం నేరమని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ఓటర్లను బెదిరించడం, భయభ్రాంతులకు గురిచేయడం లేదా ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. అలాగే సోషల్ మీడియా వేదికగా రెచ్చగొట్టే పోస్టులు పెట్టినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యాఖ్యలు చేసినా సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టప్రకారం తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అల్లర్లు, గొడవలు సృష్టించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని సీఐలు తెలిపారు. మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు మరియు ప్రజాబాహుళ్యం పోలీసులకు సహకరించాలని వారు కోరారు.

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి ఎమ్మెల్యే కాలవ.



(తెలుగు కలం) అక్టోబర్ 26 : సమాజంలో అత్యంత వెనుకబడిన వాల్మీకి బోయ సామాజిక వర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వాల్మీకి జయంతి సందర్భంగా రాయదుర్గం పట్టణంలోని వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడాతూ.. మహర్షి వాల్మీకి రామాయణం ద్వారా సమాజానికి జీవన విలువలను, నైతికతను, ధర్మబద్ధమైన జీవన విధానాన్ని బోధించారని పేర్కొన్నారు. వాల్మీకి వారసులుగా తమ సామాజిక వర్గం నైతిక విలువలను పాటిస్తూ, సమాజంలో మంచిని పెంపొందించేందుకు కృషి చేస్తోందన్నారు. అయితే, వాల్మీకి బోయ సామాజిక వర్గంలోని అనేక కుటుంబాలు నేటికీ పేదరికంలో మగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అట్టడుగు స్థాయిలో ఉన్న అనేక కుటుంబాలు కనీస సౌకర్యాలకు సైతం నోచుకోలేక ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల నుంచి ఆ వర్గం బయటపడాలంటే ఎస్టీ జాబితాలో చేర్చడం ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని దశాబ్దాలుగా అనేక ఉద్యమాలు, పోరాటాలు, ఆందోళనలు నిర్వహిస్తున్నామని గుర్తుచేశారు. ఈ అంశంపై తాను, వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి తమ వర్గ ప్రజల ఆకాంక్షలను వివరించామని తెలిపారు. ఎన్నికల సభలో ఇచ్చిన హామీని కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. వాల్మీకి, బోయ సామాజిక వర్గ ప్రజల విజ్ఞప్తిని ముఖ్యమంత్రి సానుకూలంగా పరిశీలించి, త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నట్లు తెలిపారు. తమ సామాజిక వర్గం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరిశీలాకులు గుర్రప్ప, చైర్మన్ అభ్యర్థి టశీకశాల హనుమంతు, మండల పార్టీ అధ్యక్షుడు కాలవ సన్నన్న, తలారి లావణ్య,పైతోట ఆంజనేయులు,నాయకుల తిప్పేస్వామి, మల్కన్న తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకుడు, మాజీ కౌన్సిలర్ శివపుత్ర

కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు.



(తెలుగు కలం) అక్టోబర్ 26 : రాయదుర్గం మున్సిపాలిటీ ఏడో వార్డు మాజీ కౌన్సిలర్, వైసీపీ నాయకుడు శివపుత్ర సోమవారం తన అనుచరులతో కలిసి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శివపుత్ర చేరికతో ఈ వార్డులో తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆశించిన అభివృద్ధి పనులు జరగలేదని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై శివపుత్ర టీడీపీలో చేరడం శుభపరిణామమని పేర్కొన్నారు. శివపుత్ర రాకను తాము మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని తెలిపారు. గతంలో పూర్తికాని అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లేందుకు ఆయనకు సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుత ఎనిమిదో వార్డు టీడీపీ అభ్యర్థి డబ్బిడి శివతో కలిసి పనిచేస్తూ వార్డు సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని శివపుత్రకు ఎమ్మెల్యే సూచించారు. వార్డు అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పరిశీలాకులు గుర్రప్ప, చైర్మన్ అభ్యర్థి టశీకశాల హనుమంతు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కడ్డీపుడీ మహబూబ్ బాషా,మెకానికి మల్లికార్జున,డబ్బిడి మంజు,అన్నే బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

12వ వార్డులో రాయల్ వెంకటేష్ విస్తృత ప్రచారం.. అభివృద్ధే ప్రధాన అజెండా...!

ప్రతి గడపకూ చేరుతున్న టీడీపీ అభ్యర్థి..

యశోద, వెంకటేష్‌కు మద్దతుగా పార్టీ శ్రేణుల ప్రచారం





గుంతకల్లు (తెలుగు కలం) అక్టోబర్ 26 :గుంతకల్లు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 12వ వార్డులో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి రాయల్ వెంకటేష్ వార్డులోని వీధులు, కాలనీల్లో పర్యటిస్తూ ఓటర్లను కలుస్తున్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వార్డులో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తానని వివరిస్తూ తనకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం :-

వార్డులో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, సీసీ రోడ్ల నిర్మాణం వంటి పనులపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని వెంకటేష్ ప్రచారంలో వివరిస్తున్నారు. ప్రజలకు అవసరమైన సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని, వార్డు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ముందుంటానని హామీ ఇస్తున్నారు. తనకు అవకాశం కల్పిస్తే ప్రజల నమ్మకానికి అనుగుణంగా పనిచేస్తానని ఓటర్లకు తెలియజేస్తున్నారు.

యశోదకు మద్దతుగా టీడీపీ శ్రేణుల ప్రచారం :-

రాయల్ వెంకటేష్‌కు మద్దతుగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు కూడా ప్రచారంలో పాల్గొంటున్నారు. ఇంటింటికీ వెళ్లి కౌన్సిలర్ అభ్యర్థి వెంకటేష్‌తో పాటు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి యశోదకు మద్దతు ఇవ్వాలని ఓటర్లను కోరుతున్నారు. పట్టణంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కొనసాగింపునకు తమ అభ్యర్థులకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వార్డులో ప్రజలను నేరుగా కలుస్తూ ఓటర్ల అభిప్రాయాలను తెలుసుకోవడంపై అభ్యర్థి దృష్టి సారిస్తున్నారు. 12వ వార్డులో సైకిల్ గుర్తుపై పోటీ చేస్తున్న రాయల్ వెంకటేష్‌కు ప్రజల నుంచి ఎలాంటి స్పందన లభిస్తుందనేది ఎన్నికల ఫలితాల్లో తేలనుంది.ఈ ప్రచార కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి నారాయణస్వామి, డాక్టర్ పత్తి హిమబిందు, పవన్ కుమార్ గౌడ్, అనురాధతో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం

ఈ నెల 27 నుంచి 29 వరకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు



గుంతకల్లు (తెలుగు కలం) అక్టోబర్ 26 :మున్సిపల్ ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించినట్లు గుంతకల్లు పురపాలక సంఘం కమిషనర్ ఎం. లక్ష్మీదేవి తెలిపారు. ఈరోజునుంచి ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు గుంతకల్లు మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సదుపాయం అందుబాటులో ఉంటుందని వెల్లడించారు.రాష్ట్ర ఎన్నికల సంఘం తొలిసారిగా ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పించిందన్నారు. ఇందుకోసం [https://ems.ap.gov.in/apsec](https://ems.ap.gov.in/apsec?utm_sourceRchatgpt.com)లేదా [https://secems.ap/apsec](https://secems.ap/apsec?utm_sourceRchatgpt.com) వెబ్‌సైట్ల ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. ఆఫ్‌లైన్ విధానంలో ఓటు హక్కును వినియోగించుకోవాలనుకునే ఉద్యోగులు ఎన్నికల విధుల నియామక ఉత్తర్వులు, గుర్తింపు కార్డులతో మున్సిపల్ కార్యాలయంలోని ప్రత్యేక కౌంటర్‌కు హాజరై పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయాలని కమిషనర్ లక్ష్మీదేవి కోరారు. గుంతకల్లు పురపాలక సంఘ పరిధిలో ఓటర్లుగా నమోదై, ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

వైసీపీ కుట్రలను ప్రజలు తిప్పి కొట్టాలి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

స్థానిక పోరులో ప్రశాంత వాతావరణాన్ని

దెబ్బతీసేందుకు జగన్ కుతంత్రాలు

బెంగళూరు ప్యాలెస్ కేంద్రంగా అల్లరులకు వ్యూహాలు

కేంద్రం నుంచి వచ్చే ?12,600 కోట్ల నిధులను అడ్డుకునే యత్నం

రాయదుర్గం పార్టీ కార్యకర్తల సమావేశంలో ప్రభుత్వ విప్ తీవ్ర ధ్వజం



రాయదుర్గం (తెలుగు కలం) అక్టోబర్ 26 :రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రశాంత వాతావరణంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలకు విఘాతం కలిగించేలా వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆరోపించారు. బెంగళూరు ప్యాలెస్‌లో ఉంటూ రాష్ట్రంలో కుట్ర రాజకీయాలకు ప్రణాళికలు రచిస్తున్నారని మండిపడ్డారు. సోమవారం రాయదుర్గం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.?స్థానిక సంస్థల ఎన్నికలు సక్రమంగా పూర్తయితే 16వ ఆర్థిక సంఘం నుంచి రాష్ట్రానికి రూ. 12,600 కోట్ల నిధులు వస్తాయని, వాటితో పల్లెలు, పట్టణాలు బాగుపడి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి అవకాశం లభిస్తుందని కాలవ శ్రీనివాసులు తెలిపారు. ఆ నిధులు రాష్ట్రానికి రాకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా జగన్మోహన్ రెడ్డి అనేక రాజకీయ కుట్రలు చేస్తూ ఎన్నికలను నిలిపివేయాలని చూస్తున్నారని విమర్శించారు. ఒకవైపు ఎన్నికలలో హింస, దౌర్జన్యాలను ప్రేరేపిస్తూ.. మరోవైపు కేంద్ర నిధులను అడ్డుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తున్న జగన్‌కు రాష్ట్రంలో రాజకీయం చేసే అర్హతే లేదని తేల్చి చెప్పారు.

గతంలో హింసతో సాధించిన ఏకగ్రీవాలు

?2021లో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో స్థానిక సంస్థల ఎన్నికలలో తన పరివారంతో చేసిన హింస, దౌర్జన్యాలను కళ్లారా చూశామని కాలవ గుర్తుచేశారు. అప్పట్లో ఏకంగా 1,040 నామినేషన్లను బలవంతంగా ఉపసంహరింపజేసి, 322 అక్రమ కేసులు బనాయించారని తెలిపారు. అలాగే 2 హత్యలు, 48 కిడ్నాప్‌లు చోటుచేసుకున్నాయని, 118 చోట్ల ఆస్తుల విధ్వంసం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. పుంగనూరులో మొత్తం 85 స్థానాలకు 85 స్థానాలను బలవంతంగా ఏకగ్రీవం చేసుకున్నారని, జగన్ సొంత నియోజకవర్గమైన పులివెందులలోని 108 స్థానాలలో 90 స్థానాలు దౌర్జన్యంతోనే ఏకగ్రీవమయ్యాయని నిలదీశారు. అలాగే బద్వేలులో 102 స్థానాలకు గాను 42, చంద్రగిరిలో 120కి గాను 71, తంబళ్లపల్లిలో 102 స్థానాలకు గాను 32 స్థానాలను బెదిరింపులతో ఏకగ్రీవం చేసుకున్నారని విమర్శిస్తూ, ఈ రోజు నిజాయితీగా ఎన్నికలు జరిపామని చెబుతున్న రామచంద్రారెడ్డి, మిథున్ రెడ్డిలపై నిప్పులు చెరిగారు. గతానికి భిన్నంగా ఇప్పుడు ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరుగుతున్నాయని, ప్రస్తుత స్థానిక సంస్థల ఎన్నికల్లో జెడ్పీటీసీ స్థానాలకు సంబంధించి తెలుగుదేశం పార్టీ 2,078 నామినేషన్లు, వైసీపీ 1,804, జనసేన 679, బీజేపీ 255 నామినేషన్లు దాఖలు చేశాయని, మొత్తంమీద 4,828 నామినేషన్లు, ఎంపీటీసీ స్థానాలకు 48,328 నామినేషన్లు నమోదు కావడమే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు.?కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నాయని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశీస్సులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి పాలనా అనుభవం, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారం, యువనేత నారా లోకేష్ వేగం కలసి రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయన్నారు. 20 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.?అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి చెందుతున్న తరుణంలో ప్రతిపక్ష వైసీపీ దానిని సహించలేక, సొంత మీడియాను ఉపయోగిస్తూ జాతీయ స్థాయిలో రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీసేలా కుతంత్రాలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. స్థానిక సమరంలో ప్రశాంతతకు భంగం కలిగించే వైసీపీ కుట్రలను ప్రజలంతా ఐక్యంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు గుర్రప్ప, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ హనుమంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్నబ్ తుఫాను ఎఫెక్ట్.. 5.7 లక్షల మందిని తరలించేందుకు ఏపీ సర్కార్ సన్నాహాలు



అమరావతి (తెలుగు కలం) అక్టోబర్ 26 : ప్రతినిధి : బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన వాయుగుండం తీవ్ర తుఫాన్‌గా రూపాంతరం చెంది భారత తూర్పు తీరం వైపు వేగంగా దూసుకొస్తోంది. 'అర్నాబ్'గా నామకరణం చేసిన ఈ తుఫాన్ రాబోయే అక్టోబర్ 28, బుధవారం ఉదయం నాటికి ఆంధ్రప్రదేశ్ తీరాన్ని తాకే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ **(IMD)** హెచ్చరించింది. తీరం దాటే సమయంలో గంటకు 140 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులు వీయడంతోపాటు కుంభకోణ తరహాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని అధికారులు స్పష్టం చేశారు.

ఆంధ్రప్రదేశ్‌లో యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు

తుఫాన్ ముప్పును ముందే గ్రహించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని తీవ్ర అప్రమత్తం చేసింది. రాష్ట్రంలోని ఉత్తర, మధ్య తీర ప్రాంతాలపై ఈ తుఫాన్ ప్రభావం అత్యంత తీవ్రంగా ఉండనుంది. ప్రమాదకరమైన లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న సుమారు 5.7 లక్షల మంది ప్రజలను గుర్తించిన ప్రభుత్వం, సోమవారం సాయంత్రం నుంచే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రక్రియను శరవేగంగా చేపట్టింది. విపత్తు నిర్వహణ బృందాలను సిద్ధంగా ఉంచడంతో పాటు విద్యుత్ సరఫరా, తాగునీరు మరియు అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. సముద్రం అల్లకల్లోలంగా మారనున్న నేపథ్యంలో మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లకూడదని, వేటలో ఉన్నవారు తక్షణమే ఒడ్డుకు చేరుకోవాలని హెచ్చరికలు జారీ చేశారు.

ఒడిశాలో పాఠశాలలు బంద్, హైఅలర్ట్

పొరుగునే ఉన్న దక్షిణ ఒడిశాపై కూడా 'అర్నాబ్' ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉండటంతో ఒడిశా ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు చేపట్టింది. తుఫాన్ తీవ్రత దృష్ట్యా మంగళవారం, బుధవారాల్లో ఐదు కీలక జిల్లాల్లోని పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటిస్తూ ఆదేశాలు జారీ చేసింది. లోతట్టు ప్రాంతాల ప్రజల కోసం ప్రత్యేక ఆశ్రయ కేంద్రాలను **(Cyclone Shelters)** అందుబాటులోకి తెచ్చింది.

పశ్చిమ బెంగాల్‌పై కూడా గణనీయమైన ప్రభావం

ఈ తుఫాన్ ప్రభావం పశ్చిమ బెంగాల్‌లోని పలు జిల్లాలపై కూడా పడనుంది. అక్టోబర్ 27 నుంచి 30 మధ్య కోల్‌కతా, హౌరా, హుగ్లీ, ఝార్‌గ్రామ్, ఉత్తర మరియు దక్షిణ 24 పరగణాలు, మేదినీపూర్, బంకురా జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముంది. తీర ప్రాంతాల్లో గంటకు 35 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే ప్రమాదం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర బెంగాల్‌లోని డార్జిలింగ్, కాలింపాంగ్, అలీపుర్‌దువార్ జిల్లాల్లో కూడా అక్టోబర్ 29, 30 తేదీలలో భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల దృష్ట్యా తీరప్రాంత ప్రజలందరూ అనవసర ప్రయాణాలు నివారించి, ప్రభుత్వ మరియు వాతావరణ శాఖ జారీ చేసే అధికారిక హెచ్చరికలను నిరంతరం గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రైతు బజార్ల ద్వారా తక్కువ ధరలకే నాణ్యమైన బియ్యం విక్రయాలు

జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు

అనంతపురం (తెలుగు కలం) అక్టోబర్ 26 : ప్రతినిధి : ఎల్‌నినో ప్రభావం తదితర కారణాల వల్ల బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో, సామాన్య ప్రజలకు ఉపశమనం కలిగిస్తూ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అనంతపురము జిల్లాలోని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, సరసమైన ధరలకు నాణ్యమైన బియ్యాన్ని అందుబాటులో ఉంచేందుకు ఖచీవీ, దీూ రకాల బియ్యం విక్రయాలను రైతు బజార్ల ద్వారా ప్రారంభించింది. ప్రభుత్వం మరియు పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు అనంతపురము జిల్లాలోని రైతు బజార్ ద్వారా ఖచీవీ రకం బియ్యం కిలో రూ.50 చొప్పున, దీూ బియ్యం కిలో రూ.49 చొప్పున విక్రయాలు 12-10-2026 నుంచి ప్రారంభమయ్యాయి. బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు బియ్యం కొనుగోలు చేయాల్సిన అవసరం లేకుండా నిరోధించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. ప్రతి రేషన్ కార్డుదారుడు లేదా ఆధార్ నంబరు కలిగిన వ్యక్తి గరిష్ఠంగా 26 కిలోల వరకు బియ్యాన్ని కొనుగోలు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. బియ్యం కొనుగోలు చేయాలనుకునే వినియోగదారులు తమ రేషన్ కార్డు లేదా ఆధార్ నంబరును తప్పనిసరిగా వెంట తీసుకురావాల్సి ఉంటుంది. విక్రయాలు సక్రమంగా మరియు పారదర్శకంగా జరిగేలా తహశీల్దారు/పౌర సరఫరాల ఉప తహశీల్దారు పర్యవేక్షించనున్నారు. రైతు బజార్లలో బియ్యం విక్రయాలు ప్రతిరోజూ ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 3:00 గంటల నుంచి సాయంత్రం 6:00 గంటల వరకు అందుబాటులో ఉంటాయి. కావున, అనంతపురము జిల్లా ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రాయచోటిలో భర్త కోసం బాధితురాలి ఒంటరి పోరాటం

న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యమని హెచ్చరిక



రాయచోటి (తెలుగు కలం) అక్టోబర్ 25 : ప్రతినిధి : తనను నమ్మి వివాహం చేసుకున్న భర్త తనకు కావాలంటూ ఓ వివాహిత అతని నివాసం వద్ద ఒంటరి పోరాటానికి దిగిన ఘటన రాయచోటి మండలంలో స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. అన్నమయ్య జిల్లా సంబేపల్లి మండలం నాయనివారిపల్లికి చెందిన సుజాత అనే మహిళ, రాయచోటి మండలం చెన్నముక్కపల్లి గ్రామం రాజుల కాలనీలోని తన భర్త తరిగొండ మల్లేశ్ నివాసం ఎదుట శనివారం నిరసన వ్యక్తం చేశారు. బాధితురాలు సుజాత తెలిపిన వివరాల ఇలున్నాయి. "నీతోనే నా జీవితం" అని నమ్మబలికిన మల్లేశ్, తనను తల్లిదండ్రుల నుంచి దూరం చేసి వివాహం చేసుకున్నాడు. అయితే, మల్లేశ్ తల్లిదండ్రులు అతడిని బ్లాక్ మెయిల్ చేసి బలవంతంగా మరొక మహిళతో రెండో వివాహం జరిపించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మల్లేశ్ తల్లిదండ్రుల ఒత్తిడి కారణంగానే తనకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆమె ఆరోపించారు. తన భర్తకు దూరంగా ఉండలేనని, చావైనా చస్తాను గానీ తన భర్తతోనే ఉంటానని సుజాత స్పష్టం చేశారు. పోలీసు అధికారులు, మీడియా ప్రతినిధులు స్పందించి తనకు న్యాయం చేయాలని ఆమె వేడుకున్నారు. ఒకవేళ తనకు న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యమని ఆమె తీవ్ర ఆవేదనతో హెచ్చరించారు.

ధర్మవరంలో ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాలు



ధర్మవరం (తెలుగు కలం) అక్టోబర్ 26 : ప్రతినిధి : శ్రీ సత్యసాయి జిల్లా ?ధర్మవరం డివిజన్ కేంద్రంలోని రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో సోమవారం ఆదికవి, మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీవో రాంగోపాల్ రెడ్డి, తాసిల్దార్ దేవరాజు లు పాల్గొని మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ?ఈ సందర్భంగా ఆర్డీవో రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ... రామాయణ మహాకావ్యాన్ని ప్రపంచానికి అందించిన మహర్షి వాల్మీకి ఆదర్శాలు సదా స్మరణీయమని, ఆయన చూపిన ధర్మం, సత్యం, నైతిక విలువల బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. రామాయణం ద్వారా మానవ సంబంధాల గొప్పతనాన్ని, ధర్మ మార్గాన్ని సమాజానికి దిశానిర్దేశం చేశారని కొనియాడారు. అనంతరం తాసిల్దార్ దేవరాజు మాట్లాడుతూ వాల్మీకి మహర్షి బోధనలు నేటి సమాజానికి ఎంతో ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి దుర్మరణం



ముదిగుబ్బ (తెలుగు కలం) అక్టోబర్ 26 : ప్రతినిధి : శ్రీసత్యసాయి జిల్లా?ముదిగుబ్బ మండలం రాళ్ల అనంతపురం క్రాస్ వద్ద సోమవారం సాయంత్రం చోటుచేసుకున్న తీవ్ర రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ?సేకరించిన వివరాల ప్రకారం, బుక్కపట్నం మండలం మారాల గ్రామానికి చెందిన మంగళ నాగేష్ అనే వ్యక్తి అనంతపురం నుంచి తన ద్విచక్ర వాహనంపై తవుడు బస్తాలు వేసుకొని ముదిగుబ్బ వైపు ప్రయాణిస్తున్నాడు. మార్గమధ్యంలో సాయంత్రం సుమారు నాలుగు గంటల సమయంలో రాళ్ల అనంతపురం కూడలి సమీపంలోకి రాగానే, వాహనంపై నియంత్రణ కోల్పోయి రోడ్డు డివైడర్‌ను అత్యంత బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన నాగేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ముదిగుబ్బ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

కేతిరెడ్డిపై విరుచుకుపడ్డ బీజేపీ నాయకులు..

చేనేతల సంక్షేమంపై సవాల్!



ధర్మవరం **(తెలుగు కలం) అక్టోబర్ 26 :** ప్రతినిధి : మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వైఖరిపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే నియోజకవర్గాల పునర్విభజన (డీ లిమిటేషన్) ప్రక్రియ పూర్తయ్యాక కేతిరెడ్డి ఇక ధర్మవరం నియోజకవర్గంలోనే ఉండడని ఎద్దేవా చేశారు. ధర్మవరంలో చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోని మంత్రి ప్రత్యేకంగా చేనేత క్లస్టర్‌ను ఏర్పాటు చేశారని బీజేపీ నేతలు గుర్తుచేశారు. గతంతో పోలిస్తే చేనేతల అభివృద్ధి కోసం మంత్రి చేసిన కృషి ఎంతో మెరుగైనదని, ఒకవేళ దీనికంటే ఎక్కువ పనిచేసినట్లు ఆధారాలు ఉంటే నిరూపించాలని కేతిరెడ్డికి బహిరంగ సవాల్ విసిరారు. సొంత ప్రయోజనాల కోసం చేనేత కార్మికులను రెచ్చగొడుతూ కేతిరెడ్డి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. చేనేత సోదరులు ఎవరూ ఆయన పన్నుతున్న రాజకీయ ఉచ్చులో పడవద్దని బీజేపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. రాబోయే రోజుల్లో కూటమి అభ్యర్థులను గెలిపిస్తేనే ప్రాంతం మరింత అభివృద్ధి బాటలో పయనిస్తుందని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ మళ్లీ గెలిస్తే ఎలాంటి అభివృద్ధి జరగదని, వారు పనులు చేయరని విమర్శించారు. అందుకే ధర్మవరంతో పాటు రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కూటమి గెలుపే ఏకైక మార్గమని వారు స్పష్టం చేశారు.

తుఫాను ముప్పు శ్రీకాకుళం జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు మంగళవారం సెలవు ప్రకటన



శ్రీకాకుళం (తెలుగు కలం) అక్టోబర్ 26 : ప్రతినిధి : బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్నబ్' తుఫాను హెచ్చరికల నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా యంత్రాంగం ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టింది. ఈ ముప్పును దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు మంగళవారం సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక అధికారిక ప్రకటనలో వెల్లడించారు. విద్యార్థుల భద్రతకే అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. తుఫాను ప్రభావం వల్ల రాకపోకలకు ఎలాంటి అవరోధాలు లేదా ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఆదేశాలు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ వంటి అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు మరియు కరస్పాండెంట్లకు వర్తిస్తాయని, అందరూ దీనిని తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఈ అత్యవసర సెలవు కారణంగా విద్యార్థుల అకాడమిక్ క్యాలెండర్‌కు ఎలాంటి ఆటంకం కలగకుండా తగిన చర్యలు తీసుకోనున్నారు. నష్టపోయే ఈ పనిదినాన్ని భర్తీ చేయడానికి ప్రత్యామ్నాయ రోజును కేటాయిస్తూ త్వరలోనే ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేస్తామని కలెక్టర్ వివరించారు. పరిస్థితుల దృష్ట్యా అధికారులు మరియు పాఠశాల యాజమాన్యాలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి, విద్యార్థుల అభద్రతను నివారించేందుకు అవసరమైన అన్ని ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
సోమవారం 26 -10 - 2026

అబాకస్‌లో లిటిల్ మూన్ విద్యార్థుల సత్తా

చురుకైన లెక్కలు.. వేగవంతమైన సమాధానాలు.. చిన్నారుల ప్రతిభకు మాస్టర్ ప్రశంసలు





గుంతకల్లు (తెలుగు కలం) అక్టోబర్ 26 :గుంతకల్లు పట్టణంలోని పాత గుంతకల్లు అంకాలమ్మ దేవాలయం సమీపంలో ఉన్న లిటిల్ మూన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు అబాకస్‌లో తమ ప్రతిభను చాటుకుంటున్నారు. పాఠశాలలో కొనసాగుతున్న అబాకస్ ప్రోగ్రామ్‌లో విద్యార్థులు చూపుతున్న పురోగతిని పరిశీలించేందుకు ఇటీవల అబాకస్ మాస్టర్ పాఠశాలను సందర్శించారు.ఈ సందర్భంగా చిన్నారులకు పలు గణిత ప్రశ్నలు వేసి వారి సమాధానాలను పరిశీలించారు. విద్యార్థులు వేగంగా, కచ్చితంగా సమాధానాలు చెప్పడంతో వారి ప్రతిభ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల్లో ఏకాగ్రత, గణన సామర్థ్యం పెంపొందేలా శిక్షణ అందిస్తున్న ఉపాధ్యాయుల కృషిని అభినందించారు.ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ కె. నగేష్ మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రత్యేక నైపుణ్యాలను పెంపొందించే శిక్షణ అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. అబాకస్ సాధన చిన్నారుల్లో గణితంపై ఆసక్తి, ఆత్మవిశ్వాసం, ఏకాగ్రతను పెంపొందించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల అభివృద్ధికి సహకరిస్తున్న ఉపాధ్యాయులకు, ప్రోత్సాహం అందిస్తున్న తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

కళ్యాణదుర్గం తహసీల్దార్ కార్యాలయంలో
ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు



కళ్యాణదుర్గం (తెలుగు కలం) అక్టోబర్ 26 : ప్రతినిధి : అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ (ఎమ్మార్వో) భాస్కర్ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వాల్మీకి మహర్షి చిత్రపటానికి తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రామాయణ గ్రంథ రచయిత, ఆదికవి అయిన మహర్షి వాల్మీకి సమాజానికి అందించిన సేవలను, ఆయన బోధించిన మానవ విలువలను అధికారులు స్మరించుకున్నారు. ప్రతి ఒక్కరూ వాల్మీకి ఆదర్శాలను జీవితంలో అలవర్చుకోవాలని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు. ?ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు (ఆర్ఐ), సీనియర్ అసిస్టెంట్లు, గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్వో), కార్యాలయ సిబ్బంది ఇతర రెవెన్యూ శాఖ అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేశారు.

తిమ్మసముద్రంలో గ్రామసభ..
శాంతిభద్రతలపై పోలీసుల అవగాహన



కళ్యాణదుర్గం (తెలుగు కలం) అక్టోబర్ 26 : ప్రతినిధి : స్థానిక సంస్థల ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసులు ముమ్మర చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా తిమ్మసముద్రం గ్రామంలో ప్రత్యేకంగా గ్రామసభను నిర్వహించారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు గ్రామ ప్రజలంతా పోలీసులకు, అధికారులకు సంపూర్ణ సహకారం అందించాలని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. సభలో అధికారులు, పోలీసులు పాల్గొని ఓటర్లకు, గ్రామస్తులకు ఎన్నికల నియమావళి, ఎన్నికల నేరాలు మరియు వాటి తీవ్రతపై సమగ్ర అవగాహన కల్పించారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు. ?అదేవిధంగా, గ్రామంలో ఎలాంటి గొడవలు, వివాదాలు లేదా వర్గపోరుకు తావులేకుండా నడుచుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉంటూ, పండుగ వాతావరణంలో ఎన్నికలు పూర్తి చేసుకునేలా ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.

శాంతియుత వాతావరణంలో
ఎన్నికల నిర్వహణే ధ్యేయం బొమ్మనహాలు ఎస్సై నబి రసూల్



బొమ్మనహాలు (తెలుగు కలం) అక్టోబర్ 26 :రానున్న స్థానిక సంస్థల (జెడ్పీటీసీ, ఎంపీటీసీ) ఎన్నికలను పురస్కరించుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో ముందస్తు భద్రతా చర్యలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా మంగళవారం బొమ్మనహాలు ఎస్సై నబి రసూల్ తన సిబ్బందితో కలిసి మండలంలోని కొత్తూరు, యెలంజి, కానాపురం గ్రామాలలో విస్తృత పర్యటన చేపట్టారు.?ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలతో ముఖాముఖి సమావేశం నిర్వహించిన ఎస్సై, ఎన్నికల ప్రక్రియను ఎలాంటి ఘర్షణలు లేదా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పూర్తి ప్రశాంత వాతావరణంలో, ప్రజాస్వామ్యబద్ధంగా పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎన్నికల వేళ గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, అల్లర్లకు పాల్పడే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.?సమావేశం ముగిసిన అనంతరం ప్రజాభద్రతను పెంపొందించడం మరియు ప్రజల్లో భరోసా కల్పించడంలో భాగంగా పోలీసులు ఆయా గ్రామాలలో విస్తృతంగా ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. వీధుల గుండా పర్యటిస్తూ పరిస్థితిని సమీక్షించిన ఎస్సై, గ్రామాల్లో ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా లేదా ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ అక్రమాలకు పాల్పడినా వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని గ్రామస్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైతో పాటు స్థానిక పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు మరియు యువకులు పాల్గొన్నారు.

గొనబావిలో పోలీసుల అవగాహన సదస్సు

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలి

రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ

గుమ్మఘట్ట (తెలుగు కలం) అక్టోబర్ 26 : స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిసేలా ప్రజలందరూ పోలీసులకు పూర్తి సహకారం అందించాలని రాయదుర్గం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ పిలుపునిచ్చారు.?గుమ్మఘట్ట మండలంలోని గొనబావి గ్రామంలో సోమవారం సీఐ వెంకటరమణ, ఎస్ఐ చిన్నరాయుడు సంయుక్తంగా గ్రామస్థులతో ఒక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటరమణ గ్రామంలోని మహిళలు, యువత మరియు విద్యార్థులతో మాట్లాడారు.సదస్సులో భాగంగా సీఐ మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని హెచ్చరించారు.



శాంతిభద్రతల పరిరక్షణకు గ్రామస్థులందరూ పోలీసు శాఖకు పూర్తిగా సహకరించాలని కోరారు. అనంతరం మహిళలు, బాలికలపై జరుగుతున్న నేరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీఐ ప్రసంగించారు. నేటి సమాజంలో బాల్యవివాహాల వల్ల కలిగే తీవ్ర అనర్థాలను వివరించి, వాటిని పూర్తిగా అరికట్టాలని పిలుపునిచ్చారు. అలాగే, ప్రయాణ సమయాల్లో ప్రాణ రక్షణ కోసం ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, విద్య యొక్క ప్రాముఖ్యతను తెలుపుతూ పిల్లలను బడికి పంపాలని గ్రామస్థులకు సీఐ వెంకటరమణ సూచించారు.

గొర్రెను మింగిన కొండచిలువ పొడరాళ్లపల్లి వద్ద కలకలం



ముదిగుబ్బ (తెలుగు కలం) అక్టోబర్ 26 : ప్రతినిధి : శ్రీ సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలంలో కొండచిలువ సంచారం స్థానిక గ్రామస్థులను తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. మండలంలోని పొడరాళ్లపల్లి సమీపంలో ఉన్న బడెద్దుల మడుగు ప్రాంతంలో సోమవారం ఓ భారీ కొండచిలువ గొర్రెను మింగిన ఘటన వెలుగుచూసింది. స్థానిక వివరాల ప్రకారం, గొర్రెల కాపరి అశోక్ రోజూ మాదిరిగానే తన గొర్రెల మందను బడెద్దుల మడుగు వద్ద మేపుతుండగా ఈ సంఘటన జరిగింది. గొర్రెలు మేస్తుండగా పొదల్లో నుంచి అకస్మాత్తుగా ప్రత్యక్షమైన భారీ కొండచిలువ ఓ గొర్రెను గట్టిగా చుట్టుకొని మింగడం ప్రారంభించింది. ఇది గమనించిన గొర్రెల కాపరి అశోక్ తక్షణమే అప్రమత్తమై, మిగిలిన గొర్రెల మందను అక్కడి నుంచి సురక్షితంగా దూరంగా తీసుకెళ్లాడు. అనంతరం గ్రామస్థులకు విషయం తెలియజేసి, ప్రమాదకరమైన ఆ ప్రాంతానికి ఎవరూ వెళ్లవద్దని హెచ్చరించారు. ఈ ఘటనతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, రైతు కూలీలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీ శాఖ అధికారులు వెంటనే స్పందించి, ఆ కొండచిలువను సురక్షితంగా పట్టుకొని దట్టమైన అటవీ ప్రాంతంలో విడిచిపెట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

స్థానిక ఎన్నికలను స్వేచ్ఛగా,
ప్రశాంతంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు

కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్



పుట్టపర్తి(తెలుగు కలం) అక్టోబర్ 26 : ప్రతినిధి : శ్రీ సత్యసాయి జిల్లాలో రాబోయే మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంతంగా మరియు పూర్తి పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేపట్టిందని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. సోమవారం పుట్టపర్తిలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణ విధానంపై వివిధ శాఖల అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు పి. అరుణ్ బాబు, జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్లతో కలిసి కలెక్టర్ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు, భయాందోళనలకు గురికాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పక్కా భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని, కేంద్రాల వద్ద ప్రాథమిక సౌకర్యాల ఏర్పాటుతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.

రైలు కింద పడి పాలిటెక్నిక్ విద్యార్థి మృతి



పెనుకొండ/పీలేరు (తెలుగు కలం) అక్టోబర్ 26 : ప్రతినిధి : పీలేరు రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రైలు కింద పడి 18 సంవత్సరాల మైసూర్ అరవింద్ కుమార్ అనే పాలిటెక్నిక్ విద్యార్థి దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన ప్రమాద ఫోటోల ఆధారంగా మృతుడిని శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ మండలం బోయగేరి ఎస్సీ కాలనీకి చెందిన అరవింద్ కుమార్‌గా అతడి బంధువు మైసూర్ గణేష్ గుర్తించారు. మృతుడు పీలేరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా మొదటి సంవత్సరం చదువుతున్నట్లు తెలిసింది. ?ఈ ఘటనను కదిరి ఆర్పీఎస్ఐ బాలకృష్ణ ధృవీకరించారు. విద్యార్థి మృతికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉందని, ప్రమాదవశాత్తు జరిగిందా లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు. నవమాసాలు మోసి పెంచిన కుమారుడు ఉన్నట్లుండి అనంతలోకాలకు వెళ్లడంతో బోయగేరి ఎస్సీ కాలనీలో తీవ్ర శోకసంద్రం అలుముకుంది.

లేపాక్షి సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం
వంట మేస్త్రి అక్కడికక్కడే దుర్మరణం



లేపాక్షి (తెలుగు కలం) అక్టోబర్ 26 : ప్రతినిధి : శ్రీ సత్యసాయి జిల్లా లేపాక్షి మండలం పరిధిలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. బైకు అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో ఓ వంట మేస్త్రి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. స్థానికుల కథనం ప్రకారం, సిరివరం గ్రామానికి చెందిన మంజునాథ్ వృత్తిరీత్యా వంట మేస్త్రిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పని నిమిత్తం కంచి సముద్రం గ్రామానికి వెళ్లి, తిరిగి తన ద్విచక్రవాహనంపై స్వగ్రామైన సిరివరం వైపు వస్తుండగా మద్దిపి క్రాస్ వద్ద ఈ దుర్ఘటన జరిగింది. వాహనం వేగంగా వస్తున్న సమయంలో మద్దిపి క్రాస్ వద్ద అకస్మాత్తుగా బైకుపై నియంత్రణ కోల్పోవడంతో ద్విచక్రవాహనం రోడ్డుపై తీవ్రంగా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మంజునాథ్‌కు తీవ్ర గాయాలవ్వడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రమాదానికి గల పూర్తి వివరాలు, కారణాలపై దర్యాప్తు వేగవంతం చేశారు. మంజునాథ్ అకాల మరణంతో ఆయన స్వగ్రామమైన సిరివరంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి.

జనసేనకు మద్దతుగా హైపర్ ఆది ప్రచారం

ఏపీ పురపాలక ఎన్నికల ప్రచారంలో హైపర్ ఆది

పిఠాపురంలో జనసేన అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం

పవన్‌కు గెలుపును గిఫ్ట్‌గా ఇవ్వాలని ఓటర్లకు పిలుపు



ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ప్రధాన పార్టీల నాయకులు, అభ్యర్థులు విస్తృతంగా పర్యటిస్తున్న వేళ, కూటమి తరఫున స్టార్ క్యాంపెయినర్లు కూడా ప్రచార బరిలోకి దిగుతున్నారు. ఇందులో భాగంగా సినీ నటుడు, జనసేన స్టార్ క్యాంపెయినర్ హైపర్ ఆది పిఠాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పిఠాపురం పట్టణంలో ప్రచార కార్యక్రమంలో ఆది పాల్గొన్నారు. జనసేన మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థి దానం లాజర్ బాబు, కౌన్సిలర్ అభ్యర్థులు సునీత, కామేశ్వరిలకు మద్దతుగా ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా హైపర్ ఆది మాట్లాడుతూ, “పవన్ కల్యాణ్ అంటే అభివృద్ధి, అభివృద్ధి అంటే పిఠాపురం. అలాంటి పిఠాపురంలో మన గాజు గ్లాసును గెలిపించాలి. పవన్ కల్యాణ్ బలపరిచిన నాయకులను మనం గెలిపించుకుని ఆయనకు గిఫ్ట్‌గా ఇవ్వాలి. అప్పుడే మరింత అభివృద్ధి జరుగుతుంది” అని ఓటర్లకు పిలుపునిచ్చారు. ఈ వార్త మీకు నచ్చిందా?.. నచ్చిన వార్తలను మీ మిత్రుల

ఇలాగైతే ప్రజల మద్దతు పొందలేరు..
ఆ పార్టీ దుకాణం సర్దేసుకోవడం మంచిది మంత్రి అనగాని

స్థానిక ఎన్నికల్లో ఓటమి భయంతోనే వైసీపీ అల్లర్లకు పాల్పడుతోందన్న మంత్రి అనగాని

పుంగనూరు, తిరుపతి సహా పలుచోట్ల దాడులే ఇందుకు నిదర్శనమని వెల్లడి

ప్రజలు చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమానికి మద్దతిస్తున్నారని స్పష్టీకరణ

11 సీట్లకు పరిమితం చేసినా జగన్ తీరు మారలేదని విమర్శ



స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి తప్పదనే భయంతోనే వైసీపీ రాష్ట్రవ్యాప్తంగా అల్లర్లు, విధ్వంసాలకు పాల్పడుతోందని రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల మద్దతు పొందలేకే జగన్ హింసా రాజకీయాలను ఎంచుకున్నారని ఆయన విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.చిత్తూరు, తిరుపతి, రాయచోటి, పులివెందుల, కడప, దర్శి, కనిగిరి వంటి ప్రాంతాల్లో వైసీపీ శ్రేణులు చేసిన దాడులే ఇందుకు నిదర్శనమని అనగాని పేర్కొన్నారు. ఎన్నికలు ఏవైనా హింసను ప్రోత్సహించడమే జగన్ నైజమని, గత ఐదేళ్ల పాలనను చూసి ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినా ఆయన తీరులో ఎలాంటి మార్పు రాలేదని అన్నారు. కుట్రలు, దాడులు, విధ్వంసాలతో ప్రజల ఓట్లు సాధించలేరనే వాస్తవాన్ని జగన్ గుర్తించాలని హితవు పలికారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష మద్దతు లభిస్తోందని మంత్రి తెలిపారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఛాంపియన్ కూటమి విజయ దుందుభి మోగిస్తోందని ధీమా వ్యక్తం చేశారు. “స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు చూసైనా గొడ్డలి పార్టీ నాయకులకు, జగన్ రెడ్డికి బుద్ధి రావాలి. ఇక ఆ పార్టీ దుకాణం సర్దేసుకోవడం మంచిది” అని అనగాని సత్యప్రసాద్ తన ప్రకటనలో వ్యాఖ్యానించారు.

విశాఖ స్థానిక ఎన్నికలు: ‘సేల్’ వర్సెస్ ‘సేవ్’.. వైసీపీ కొత్త నినాదం

విలువైన నగర భూములను కార్పొరేట్లకు అమ్ముతున్నారని వైసీపీ ఆరోపణ

ప్రభుత్వంపై మేయర్ అభ్యర్థి వరుదు కల్యాణి, మాజీ మంత్రుల విమర్శలు

‘సేవ్ విశాఖ’ పేరుతో ప్రత్యేక పోస్టర్ ఆవిష్కరించిన వైసీపీ నేతలు



గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ఎన్నికలు ‘సేల్ విశాఖ’, ‘సేవ్ విశాఖ’ మధ్య జరుగుతున్నాయని వైసీపీ మేయర్ అభ్యర్థి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ మంత్రులు కూరసాల కన్నబాబు, గుడివాడ అమర్నాథ్ అన్నారు. వైసీపీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ‘సేవ్ విశాఖ’ పేరుతో ఓ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అధికారంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వం విలువైన నగర భూములను కార్పొరేట్ సంస్థలకు నామమాత్రపు ధరలకు కట్టబెడుతోందని, తద్వారా నగరాన్ని ‘సేల్ విశాఖ’గా మారుస్తోందని వారు ఆరోపించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కన్నబాబు మాట్లాడుతూ... పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా వేల ఎకరాలను కార్పొరేట్లకు అప్పగించడం ఏంటని మండిపడ్డారు. తాము అధికారంలోకి వస్తే ‘బ్లూ విశాఖ’ పేరుతో బీచ్‌ల అభివృద్ధి, పర్యాటకం, పారిశుద్ధ్యం, తాగునీరు, పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తామని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ తెలిపారు.

కలబందతో మెరిసే అందం మీ సొంతం ఎలా వాడాలంటే



అలోవెరాలో విటమిన్లు , ఫోలిక్ యాసిడ్, కోలిన్, %దీ1, దీ2, దీ3, దీ6, దీ%12 విటమిన్లు, కాల్షియం, మెగ్నీషియం, జింక్, క్రోమియం, సెలీనియం, సోడియం, ఐరన్, పొటాషియం వంటి దాదాపు 20 రకాల ఖనిజాలు ఉంటాయి. మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇది ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. అందుకే ఆయుర్వేదంలో కలబందకు ప్రత్యేక స్థానం ఉంది. ఎన్నో వ్యాధుల నివారణకు దీనిని ఔషధంగా వినియోగిస్తారు. కాబట్టి అలోవెరా జెల్ ప్రయోజనాలు, దానిని ఎలా ఉపయోగించాలో ఇక్కడ తెలుసుకుందాం..

అలోవెరా జెల్‌ని ముఖానికి అప్లై చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు ఇవే..

అలోవెరా జెల్ ముఖంపై ఫైన్ లైన్స్ సమస్య నుంచి బయటపడటానికి సులభమైన పరిష్కారం. దీన్ని చేతులు, ముఖానికి అప్లై చేయడం వల్ల చర్మంలో కొల్లాజెన్ స్థాయిలు పెరిగి చర్మం మెరుస్తుంది. దీన్ని రోజూ ముఖానికి రాసుకోవడం వల్ల చర్మం మృదువుగా, ఆరోగ్యంగా మారుతుంది.

సూర్య కిరణాల నుంచి రక్షణ

అలోవెరా శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది. అలోవెరా జెల్‌ను ముఖానికి అప్లై చేయడం వల్ల దద్దుర్లు, ముఖం వాపు నుండి ఉపశమనం పొందవచ్చు. దీన్ని ముఖానికి అప్లై చేయడం వల్ల సూర్యకిరణాలు చర్మంపై ప్రభావం చూపవు. బయట ఎక్కువ పని చేసే వారు ఇంటికి వచ్చిన తర్వాత అలోవెరా జెల్‌ని ముఖానికి రాసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.

గుండె జబ్బుల బారిన పడొద్దంటే
మీ వంటలో ఈ మార్పు తప్పక చేయండి



ఈ మధ్య కాలంలో గుండె జబ్బుల మరణాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. వీటిలో చాలా మరణాలకు రక్తంలో కొవ్వు పేరుకుపోవడమే ప్రధాన కారణం అవుతోంది. మరి రక్తంలో కొవ్వు పేరుకోకూడదు అంటే మన ఆహారపు అలవాట్లలో చాలా మార్పులు చేసుకోవాలి. ముఖ్యంగా మనం వాడే వంట నూనె విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. మన ఆరోగ్యం కచ్చితంగా మనం ఇంట్లో ఏ వంట నూనె ఉపయోగిస్తున్నాం అనే దానిపై ఆధారపడి ఉంటుంది.అదేవిధంగా నూనె రకం ఏదైనా సరే దాన్ని ఎక్కువగా వినియోగించడం కూడా మన గుండె ఆరోగ్యానికి కీడు చేస్తుంది. నూనె ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల సిరల్లో చెడు కొలెస్ట్రాల్ పరిమాణం పెరుగుతుంది. దీనివల్ల ముందుగా అధిక రక్తపోటు వచ్చి ఆ తర్వాత గుండెపోటు, గుండె వైఫల్యం, కరోనరీ ఆర్టరీ డిసీజ్, ట్రిపుల్ వెస్సెల్ డిసీజ్‌లకు దారి తీస్తుంది. కాబట్టి మనం వంట నూనె రకంపైన మాత్రమేగాకుండా వంటల్లో వినియోగించే నూనె మోతాదు విషయంలో కూడా జాగ్రత్తగా ఉండాలి.రక్త నాళాల్లో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి కొన్ని మేలైన వంట నూనెలను మాత్రమే వినియోగించాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. నూనె విషయంలో వంటలో మార్పు చేయకపోతే అనారోగ్యాన్ని కొని తెచ్చుకున్నట్లే అవుతుందని హెచ్చరిస్తున్నారు. కొన్ని నూనెలు చెడు కొలెస్ట్రాల్‌కు చెక్ పెడతాయని, వాటిని తీసుకోవడంవల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచిస్తున్నారు. వేరుశెనగ నూనెతో కొలెస్ట్రాల్ పెరుగుతుందని అంటారు. కానీ ఇది అపోహ అని నిపుణులు అంటున్నారు.వేరుశనగ నూనెను ఉపయోగించడం ఆరోగ్యానికి మంచిది. వేరుశనగ నూనెలో విటమిన్ ఇ, ఫైటోస్టెరాల్ అధిక మొత్తంలో ఉంటాయి. అయితే అధిక రక్తపోటు, మధుమేహం లాంటి దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉన్నవాళ్లు నెలల తరబడి ఒకే నూనెను కాకుండా.. రెండు నెలలకు ఒకసారి నూనె రకాన్ని మారిస్తే బాగుంటుంది. అదేవిధంగా అవిసె గింజలలో ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి అవిసె నూనెను వంటల్లో వాడితే శరీరంలో కొలెస్ట్రాల్‌తోపాటు మంట తగ్గుతుంది. అయితే అవిసె నూనెను అధిక ఉష్ణోగ్రత వద్ద మరిగించినా, ఫ్రిజ్‌లో పెట్టి కూల్ చేసినా దాని సహజ లక్షణాన్ని కోల్పోతుంది. కాబట్టి అలాంటి పొరపాటు చేయకూడదు.ఆలివ్ నూనె కూడా ఆరోగ్యానికి చాలా మంచిది. అయితే మన దేశంలో ఆలివ్ నూనె ఉత్పత్తి తక్కువగా ఉంటుంది. దానిని మధ్యప్రాచ్యం, మధ్యధరా దేశాల నుండి దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. కాబట్టి భారత్‌లో ఆలివ్ నూనె ధర చాలా ఎక్కువగా ఉంటుంది. కానీ ఆర్థిక స్తోమతను బట్టి అరుదుగానైనా ఆలివ్ నూనెను వంటలో భాగం చేసుకోవడం ముఖ్యం. దీనిలో విటమిన్ ఎ, విటమిన్ డి, విటమిన్ ఇ, విటమిన్ కె ఉంటాయి. అంతేగాక ఇది యాంటీ ఇన్‌ఫ్లమేటరీ కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సాయపడుతుంది.

మళ్లీ మళ్లీ పెరిగే దంతాలు



పాల దంతాలు ఊడిపోయి, వాటి స్థానంలో శాశ్వత దంతాలొస్తాయి. ఈ రెండో దంతాలు ఊడిపోతే కట్టుడు దంతాలు మినహా మరే మార్గమూ ఉండదు. కానీ తాజాగా జపాన్ శాస్త్రవేత్తలు మూడోసారి దంతాలు పెరిగే ఒక ఔషధాన్ని సృష్టించే ప్రయత్నంలో ఉన్నారు. ఆసక్తికరమైన ఈ అంశం గురించి తెలుసుకుందాం!రెండోసారి ఊడిపోయిన శాశ్వత దంతాల స్థానంలో, చిగుళ్ల నుంచి మూడో దంతాల సెట్ పెరగడం ఎలా ఉంటుందో ఒకసారి ఊహించండి. కిటానో ఆస్పత్రి మెడికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన డాక్టర్ కట్సు టకహాషి నాయకత్వంలోని పరిశోధకుల బృందం, దంతాల పెరుగుదలకు అవరోధంగా మారుతున్న యుఎస్ఎజి-1 అనే జన్యు ప్రొటీన్‌ను అడ్డుకునే ఔషధాన్ని అభివృద్ధి చేసింది. ఎలుకల మీద చేపట్టిన ప్రయోగాల్లో, ఈ ప్రొటీన్‌ను అణచివేయడం ద్వారా, కొత్త దంతాల పెరుగుదల విజయవంతంగా ఊపందుకోవడాన్ని పరిశోధకులు కనిపెట్టారు. 2013 నాటికి ఈ చికిత్సను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో, మనుషుల మీద కూడా ఈ ప్రయోగాలను చేపట్టడానికి పరిశోధకులు సిద్ధపడుతున్నారు. ఈ ప్రయోగం విజయవంతమైతే, ఎన్నో కోట్ల మందికి మూడవ దంతాల సెట్ ప్రయోజనం దక్కుతుంది. దశాబ్దాల పునరుత్పాదక పరిశోధన ఆధారంగా నిర్మితమైన సైన్స్... షార్కులు, ఏనుగుల మాదిరిగానే మనుషులు కూడా సహజసిద్ధంగా పెరిగే బహుళ దంతాల సెట్‌ను కలిగి ఉంటారని పరిశోధకులు నమ్ముతున్నారు. డెంటల్ పల్ప్, ఎముకల పునరుత్పాదకతలో కొనసాగుతున్న అభివృద్ధి ఆధారంగా... జన్యుపరమైన కారణాల రీత్యా, ప్రమాదాల్లో, లేదా వార్ధక్యంతో కోల్పోయిన దంతాలను తిరిగి మొలిపించుకునే వీలు కలుగుతుందని పరిశోధకులు అంటున్నారు.

మొండి పుండ్లకు జెల్ చికిత్స!
తాజా అధ్యయనంలో కీలక విషయాలు!

పుండు మానడంలో ఆక్సిజన్‌ది కీలక పాత్ర
పరిశోధకులు ఏం చెప్తున్నారంటే!

ఎంతకీ మానని మొండి పుండ్లు పెద్ద సమస్య. వీటికి చికిత్స చేయటం చాలా కష్టం. ఒకవేళ పుండ్లు మానకపోతే పాదాలు, వేళ్లు తొలగించాల్సిన పరిస్థితీ తలెత్తుతుంది. రోజు రోజుకీ వృద్ధులు, డయాబెటిస్ బాధితుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో మొండి పుండ్ల కొత్త చికిత్సలకూ ప్రాధాన్యం ఏర్పడుతోంది. దీని విషయంలో యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, రివర్‌సైడ్ రూపొందించిన జెల్ పట్టీ వ్యవస్థ కొత్త ఆశలు రేపుతోంది. గాయమైన చోట లేదా పుండ్లు ఉన్న చోట నిరంతరం ఆక్సిజన్ సరఫరా చేయటం ద్వారా పుండ్లు మానేలా చేయటం దీని ప్రత్యేకత. మరి, అదెలాగో ఇప్పుడు తెలుసుకుందాం!

ఆక్సిజన్ పాత్ర : మామూలుగా నాలుగు వారాల్లోపు నయం కాని పుండ్లను మొండిపుండ్లుగా భావిస్తుంటారు. ఈ రకం పుండ్లు నెలల కొద్దీ మానకుండా వేధిస్తుంటాయి. వీటితో ఇన్‌ఫెక్షన్ ఎక్కువ కావటం, హాస్పిటల్‌లో చేరాల్సి రావటం వంటి జరుగుతుంటాయి. కొన్ని సార్లు కాళ్లూ, చేతుల వంటివి తొలగించాల్సిన పరిస్థితీ కూడా ఏర్పడుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ఏటా సుమారు 1.2 కోట్ల మంది మొండి పుండ్ల బారినపడుతున్నారని నివేదికలు అంచనా వేస్తున్నాయి. వీరిలో సుమారు 20 శాతం మందికి పాదాలు, వేళ్ల వంటివి తొలగించాల్సిన పరిస్థితి తలెత్తుతుందని పేర్కొన్నాయి. పుండ్లు మానకపోవటానికి ఒక ప్రధాన కారణం.. ఆ భాగానికి తగినంతగా, స్థిరంగా ఆక్సిజన్ అందకపోవటమే అంటున్నారు నిపుణులు.సాధారణంగా పుండు 4 దశలు ద్వారా మానుతుంటున్నారు నిపుణులు. ముందు వాపు ప్రక్రియ తలెత్తుతుందని, ఆ తర్వాత కొత్త రక్తనాళాలు పుట్టుకొస్తాయని పేర్కొంటున్నారు. అనంతరం కణజాలం తిరిగి కుదురుకుంటుందని తెలియజేస్తున్నారు. ఆఖరికి కొత్త కణజాలం ఏర్పడుతుందని వివరిస్తున్నారు. ఈ క్రమంలో అన్ని దశల్లోనూ ఆక్సిజన్ పాత్ర కీలకమంటున్నారు. ఆక్సిజన్ తగినంత అందకపోతే వాపు ప్రక్రియ ఎక్కువ కాలం కొనసాగుతుందని చెబుతున్నారు. ఇది బ్యాక్టీరియా వృద్ధి చెందటానికి, ఇన్‌ఫెక్షన్ తలెత్తటానికి అనువైన వాతావరణం కల్పిస్తుందని తెలియజేస్తున్నారు. మరోవైపు కణజాలం తిరిగి కోలుకునే ప్రక్రియ కూడా నిలిచిపోతుందని వెల్లడిస్తున్నారు. దెబ్బతిన్న కణజాలం లోతుల్లోకి ఆక్సిజన్ చేరకపోతే మరింత సమస్యంగా మారుతుందని హెచ్చరిస్తున్నారు. దీన్ని పరిష్కరించటానికే ఖజ= పరిశోధకులు కొత్త జెల్ వ్యవస్థను రూపొందించారు. మెత్తగా, మృదువుగా ఉండే ఇది గాయమైన భాగం వద్దే నిరంతరం నేరుగా ఆక్సిజన్‌ను సృష్టిస్తుందంటున్నారు పరిశోధకులు.

ఎలా పనిచేస్తుంది : జెల్ పట్టీలో నీరు, కొలిన్ ఆధారిత ద్రవం ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు. యాంటీ బ్యాక్టీరియా గుణం గల కొలిన్ ఆధారిత ద్రవం సురక్షితమైందని, తనకు తానే క్షీణిస్తుందని అంటున్నారు. వినికిడి సాధనాల్లో ఉండేటువంటి చిన్న బ్యాటరీతో అనుసంధానమైనప్పుడు ఈ వ్యవస్థ చిన్న విద్యుత్ రసాయన పరికరంగా మారుతుందని పేర్కొంటున్నారు. అప్పుడు నీటి అణువులు విడిపోయి నెమ్మదిగా, అవసరమైనంత మేరకు ఆక్సిజన్ పుట్టుకొస్తూ ఉంటుందని వివరిస్తున్నారు. ద్రవాలను పీల్చుకునే లేదా యాంటీ మైక్రోబియల్ పదార్థాలతో కూడిన సంప్రదాయ పుండ్ల పట్టీల మాదిరిగా కాకుండా ఇది ఆక్సిజన్ లేమి సమస్యను పరిష్కరించటం ద్వారా పనిచేస్తుందని తెలియజేస్తున్నారు. ముందుగా పుండు ఆకారాన్ని కచ్చితంగా మార్చి, ఆక్సిజన్ మోతాదులు తక్కువగా ఉన్నచోట పగుళ్లను పూడ్చివేస్తుందని చెబుతున్నారు. దీంతో ఇన్‌ఫెక్షన్ ముప్పు గణనీయంగా తగ్గుతుందని అంటున్నారు. నిరంతరం ఆక్సిజన్ సరఫరా కావటం వల్ల రక్తనాళాలూ త్వరగా పుట్టుకొస్తాయని, ఫలితంగా పుండు వేగంగా మానుతుందని సూచిస్తున్నారు.

ఆశాజనక ఫలితాలు : వినూత్న జెల్ పట్టీని డయాబెటిస్ గల, వృద్ధ ఎలుకల మీద ప్రయోగించి, పరిశీలించారు పరిశోధకులు. ఎందుకంటే, వీటి పుండ్లు వృద్ధుల్లో తలెత్తే దీర్ఘకాల పుండ్లనే పోలి ఉన్నాయంటున్నారు. చికిత్స చేయకపోతే పుండు మానదని, ప్రాణాంతకంగానూ పరిణమిస్తుందని హెచ్చరిస్తున్నారు. అందుకే, ఎలుకలకు వారానికి ఒకోసారి పట్టీని మార్చుతూ, సుమారు 23 రోజుల పాటు చికిత్స చేశారని వివరిస్తున్నారు. అన్నీ జీవించి ఉన్నాయని తెలియజేస్తున్నారు. తద్వారా పట్టీ మంచి ఫలితం చూపుతున్నట్టు దీని ద్వారా రుజువైందని చెబుతున్నారు. ల్యాబ్‌లో కణజాలాలు, అవయవాలను వృద్ధి చేయటంలోనూ ఆక్సిజన్, పోషకాలు అందేలా చూడటం కీలకమంటున్నారు. ఇలాంటి వాటికీ జెల్ పట్టీ ఉపయోగపడగలదని భావిస్తున్నారు.

గ్రీన్ టీతో మెదడు చురుకుదనం



గ్రీన్ టీ ఆరోగ్యకరం అనే విషయం మనందరికీ తెలిసిందే! అయితే గ్రీన్ టీలోని సహజసిద్ధ మూలకాలు అల్జీమర్స్ నుంచి మెదడుకు రక్షణ కల్పిస్తాయనే ఒక అధ్యయనం తాజాగా వెలుగులోకొచ్చింది.గ్రీన్ టీలోని నికోటినమైడ్, ఎపిగాలోక్టేకిన్ గాలేట్ అనే రెండు సహజసిద్ధ మూలకాలు మెదడులోని పాత కణాలు కొత్త వాటిలా చురుగ్గా పని చేసేందుకు దోహదపడతాయని క్యాలిఫోర్నియా విశ్వవిద్యాలయ పరిశోధకులు కనిపెట్టారు. ఈ రెండు మూలకాలు, నష్ట నివారణలో తోడ్పడే జిటిపి అనే కీలక శక్తి అణువులను పునరుద్ధరిస్తాయని వారు పేర్కొంటున్నారు. ఈ ప్రయోగాన్ని వయసు పైబడిన ఎలుకల మీద చేపట్టినప్పుడు, అల్జీమర్స్ వ్యాధితో ముడిపడి ఉన్న అమైలాయిడ్ బీటా అనే ప్రొటీన్ మోతాదు తగ్గడాన్ని పరిశోధకులు గుర్తించారు. సాధారణంగా మనుషులకు వయసు పైబడినప్పుడు, మెదడు కణాలు శక్తిని కోల్పోతూ ఉంటాయి. ఆ కణాలను గ్రీన్ టీలోని రెండు సహజసిద్ధ మూలకాలతో చికిత్స చేసినప్పుడు, కేవలం 24 గంటల్లోనే, శక్తిమోతాదులు పెరిగి, మెదడులో 'ఆటొఫజీ' ఊపందుకుంటోంది. ఈ చికిత్స ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను కూడా తగ్గిస్తుంది. గతంలో అల్జీమర్స్ పరిశోధనల్లో, మెదడు కణాలను ఆరోగ్యంగా ఉంచడంలో జిటిపి పాత్రకున్న ప్రాధాన్యాన్ని పరిశోధకులు పెద్దగా పట్టించుకోలేదు. తాజా అధ్యయనంలో వాటిని బలపరుచుకునే మార్గం తెలిసింది కాబట్టి గ్రీన్ టీతో మెదడు కణాలను ఆరోగ్యంగా ఉంచుకోవడం ద్వారా అల్జీమర్స్‌కు అడ్డుకట్ట వేయగలిగే మార్గం సుగమం అయింది.

మీ గట్ హెల్త్ బాగుండాలా

ఆహారంలో వీటిని చేర్చుకుంటే మేలంటున్న నిపుణులు!
జీర్ణ సంబంధిత సమస్యలు దూరం చేసుకోవాలా
ఫైబర్ ఉన్న ఆహారాలు మేలు చేస్తాయట!
ఎందుకో వివరిస్తోన్న నిపుణులు!



మంచి జీర్ణక్రియ, రోగనిరోధక శక్తి, మానసిక స్థితి, మెటబాలిజం వంటి అంశాలలో గట్ హెల్త్ కీలక పాత్ర పోషిస్తుంది. అది ఆరోగ్యంగా ఉండాలంటే తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు తినాల్సిందే. అయితే వీటితో పాటు కొంచెం పీచు పదార్థాలు తింటే గట్ ఆరోగ్యం మరింత బాగుంటుందంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో ఎలాంటి ఆహార పదార్థాలు తీసుకుంటే గట్ హెల్త్‌కు మంచిదో ఇప్పుడు తెలుసుకుందాం!

దోరగా ఉన్న అరటిపండ్లు : అరటిపండ్లు, ముఖ్యంగా కొంచెం పచ్చగా ఉన్నవి, 'రెసిస్టెంట్ స్టార్చ్' అనే పీచు పదార్థాన్ని కలిగి ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇది ఒక ప్రీ బయోటిక్ వలె పనిచేస్తుందని తెలియజేస్తున్నారు. అంటే, ఇది జీర్ణవ్యవస్థలోని మంచి బ్యాక్టీరియాకు ఆహారాన్ని అందిస్తుందని పేర్కొంటున్నారు. అలాగే, రక్తంలోని చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడానికి, కడుపు నిండుగా ఉన్న అనుభూతిని కలిగించడానికి, జీర్ణక్రియ సజావుగా సాగడానికి సహాయపడుతుందని వివరిస్తున్నారు.

చియా గింజలు : చియా గింజలు పరిమాణంలో చిన్నవైనప్పటికీ, పోషకాల పరంగా చాలా శక్తివంతమైనవి. వీటిలో కరిగే పీచు పదార్థం అధికంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇది పేగుల్లో జెల్ వంటి పదార్థాన్ని ఏర్పరుస్తుందంటున్నారు.తద్వారా జీర్ణక్రియను నెమ్మదింపజేయడానికి, రక్తంలోని చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడానికి సహాయపడుతుందని తెలియజేస్తున్నారు. ఈ క్రమంలో రోజుకు ఒకటి లేదా రెండు టేబుల్ స్పూన్ల చియా గింజలను పెరుగులో కలుపుకొని గానీ, రాత్రంతా నానబెట్టి గానీ లేదా స్మూతీస్‌లో కలిపి గానీ తీసుకోవడం వల్ల జీర్ణక్రియ సామర్థ్యం మెరుగుపడుతుందట.

పప్పుధాన్యాలు, లెగ్యూమ్స్ : మన శరీరానికి కరిగే, కరగని పీచు పదార్థాలతో పాటు మొక్కల నుంచి లభించే ప్రోటీన్‌ను కూడా పప్పు దినుసులు అందిస్తాయంటున్నారు నిపుణులు. పప్పుధాన్యాలు, లెగ్యూమ్స్ విరేచనం సాఫీగా అయ్యేలా నియంత్రించడమే కాకుండా, పేగుల్లోని సూక్ష్మజీవులకు శక్తిని ఇస్తుందని చెబుతున్నారు. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి, రక్తంలోని చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడానికి కూడా తోడ్పడతాయని వివరిస్తున్నారు. ఈ క్రమంలో రోజువారీ ఆహారంలో అర కప్పు నుంచి ఒక కప్పు వరకు వండిన పప్పుధాన్యాలను చేర్చుకోవడం వల్ల శరీరానికి కావలసిన పీచు పదార్థం అందుతుందని పేర్కొంటున్నారు. లిమా బీన్స్, పచ్చి బఠానీలు, శనగలు, కిడ్నీ బీన్స్‌లో ఫైబర్ ఎక్కువగా ఉంటుందని అధ్యయనం పేర్కొంది.

బెర్రీలు : బెర్రీలు, ముఖ్యంగా బ్లూ బెర్రీలు, రాస్ప్‌బెర్రీలలో పీచు పదార్థంతో పాటు పాలీఫెనాల్స్ పుష్కలంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఈ పాలీఫెనాల్స్ పేగుల్లోని సూక్ష్మజీవుల వైవిధ్యాన్ని పెంచడానికి, జీర్ణవ్యవస్థలో వాపును తగ్గించడానికి సహాయపడతాయంటున్నారు. సమతుల్య ఆహారంలో భాగంగా ప్రతిరోజూ అర కప్పు నుంచి ఒక కప్పు వరకు బెర్రీలను తీసుకోవాలని సూచిస్తున్నారు.

నట్స్ : వాల్‌నట్స్, పిస్తా, జీడిపప్పు, బాదం పప్పులోని పీచు పదార్థం కడుపు నిండుగా ఉన్న అనుభూతిని ఇవ్వడమే కాకుండా, మెటబాలిక్ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయంటున్నారు నిపుణులు. ప్రతిరోజూ పావుకప్పు నట్స్ తీసుకోవడం వల్ల పేగుల్లోని సూక్ష్మజీవుల వైవిధ్యం పెరుగుతుందని చెబుతున్నారు. అంతేకాకుండా, వీటిని ఎక్కడికైనా సులభంగా తీసుకెళ్లవచ్చు, రోజువారీ ఆహారంలో చాలా తేలికగా చేర్చుకోవచ్చట. పిస్తా, జీడిపప్పు, బాదం.. మన గట్ మైక్రోబయోమ్‌కు ప్రత్యేకంగా సహాయపడతాయని అధ్యయనం పేర్కొంది.పేగు ఆరోగ్యానికి పీచు పదార్థం ఎందుకు అవసరం? : జీర్ణవ్యవస్థలో సమతుల్యతను కాపాడటంలో పీచు పదార్థం కీలక పాత్ర పోషిస్తుంది. ఇది మలబద్ధకాన్ని తగ్గించడానికి, విరేచనం సాఫీగా అయ్యేలా నియంత్రించడానికి, గుండె జబ్బులు, పేగు క్యాన్సర్, టైప్ 2 డయాబెటిస్ వంటి వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. గట్ మైక్రోబయోటా వైవిధ్యాన్ని నిర్వహించడానికి ఆహారంలో ఫైబర్ కీలకమైన పోషకమని అధ్యయనం పేర్కొంది.

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

మంగళవారం 27 - 10 - 2026

భారీగా పెరిగిన సన్న బియ్యం ధరలు.. కిలో రూ.90 నుంచి రూ.100



రాష్ట్రంలో బియ్యం ధరలు రాకెట్ వేగంతో దూసుకెళ్తున్నాయి. క్వాలిటీ సన్న రకం బియ్యానికి కిలో రూ.90 నుంచి రూ.100 పలుకుతున్నట్లు తెలుస్తోంది. అయితే నిజంగానే సన్న బియ్యం కొరత ఉందా అని చాలా మందికి డౌట్ వస్తుంది. ఎందుకంటే రాష్ట్రంలో గత సంవత్సరం వరకు వరి భారీగా పండింది. ఈ సంవత్సరం వర్షాకాలంలో కూడా వరి సాగు బాగానే ఉంది. కానీ సన్న బియ్యం ధరలు ఎందుకు పెరుగుతున్నాయని సామాన్యులు చర్చించుకుంటున్నారు. ఎల్ నినో బూచి చూపి వ్యాపారులు బియ్యాన్ని బ్లాక్ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని సామాన్యులు కోరుతున్నారు.10 నెలల క్రితం వరకు సన్నబియ్యం కిలో రూ.45-50 నుంచి పలుకేవి. ఇక మేలు రకాలు రూ.60-65కే లభించేవి. ఇప్పుడు ధరలు అమాంతం పెరిగాయి. వచ్చే ఏడు, ఎనిమిది నెలల్లో కరువు వస్తుందని ఇప్పుడే సన్నబియ్యం ధరలు పెంచుతున్నారు. నాణ్యత, రకం, ప్రాంతాన్ని బట్టి కిలో రూ.60 నుంచి రూ.85-90 వరకు విక్రయిస్తున్నారు. కొన్ని చోట్లు రూ.100 కూడా తీసుకుంటున్నారు. మూడు నెలల వ్యవధిలోనే 30-40 శాతంపైగా ధరలు పెంచారు. మరోవైపు రేషన్ బియ్యం కిలో రూ.12 నుంచి రూ.16 కొనుగోలు చేసి.. వాటిని ప్రాసెసింగ్ చేసి.. కిలో రూ.50 నుంచి రూ.60 లకు విక్రయిస్తున్నారు. బంగారం ధర రూ. 2 లక్షలకు.. సిల్వర్ రూ. 4 లక్షలకు వెళ్లడం ఖాయం.. బులియన్ నిపుణులు తాజా అంచనాలివిగో.. దీనిపై కూడా ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. కాగా మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులు గోదాముల్లో లక్షల టన్నుల సన్నబియ్యాన్ని అక్రమంగా దాచిపెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. వరి పంట సాగు విషయానికొస్తే.. 2019-20లో రాష్ట్రంలో ధాన్యం దిగుబడి 72 లక్షల టన్నులు ఉంటే..2025-26 నాటికి 148.30 లక్షల టన్నులకు పెరిగింది. రాష్ట్ర అవసరాలకు మించి ధాన్యం ఉత్పత్తి అవుతుంటే ధరలు తగ్గాల్సి పోయి.. పెరగడం ఏంటని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ఇదంతా కృత్రిమ కొరతగా చెబుతున్నారు. వ్యాపారులు రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి భారీ ధరకు ప్రజలకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం సన్న వడ్లు క్వింటా రూ.2800 నుంచి రూ.3100 పలుకుతోంది. అంటే కిల్లో రూ.31 పడుతుంది. అంటే కిలో వడ్లకు 700 గ్రాముల వరకు బియ్యం వస్తాయి. దీంతో వ్యాపారులు కిలో బియ్యం రూ.60 నుంచి రూ.70 లకు విక్రయిస్తున్నారు. గతంలో ప్రభుత్వం 5 లక్షల టన్నుల సన్న వడ్లను వేలం వేస్తే కనీస ధరకు సైతం కొనుగోలు చేసేందుకు మిల్లర్లు, వ్యాపారులెవరూ ముందుకు రాలేదని అధికారులు చెబుతున్నారు. కాని ఇప్పుడు పరిస్థితి మారింది. మరో విశేషం ఏమిటంటే.. ప్రభుత్వం రేషన్ షాపుల్లో సన్న బియ్యం ఇస్తోంది. చాలా మంది ఈ బియ్యమే తింటున్నారు. డిమాండ్ భారీగా లేనప్పటికీ బియ్యం ధరలు భారీగా పెరుగుతున్నాయి. బియ్యం ధరలు ఇలా పెరిగితే సామాన్యులకు ఇబ్బందులు తప్పవు. సన్న బియ్యం ధరలు పెరగడంతో హోటల్లో కూడా ధరలు పెంచుతున్నారు. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

“నువ్వుంటే చాలు గెలుస్తాం” కోచ్‌ల నమ్మకాన్ని నిలబెట్టిన తిలక్ వర్మ



న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టీ20లో భారత జట్టు అద్భుత విజయం సాధించింది. ఓటమి అంచున నిలిచిన జట్టును యువ సంచలనం తిలక్ వర్మ తన అద్భుత బ్యాటింగ్‌తో గెలిపించాడు. క్రైస్ట్‌చర్చ్‌లోని హేగ్లీ ఓవల్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో, 181 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్ చివరి ఓవర్‌లో విజయాన్ని అందుకుంది. కేవలం 26 బంతుల్లో అజేయంగా 51 పరుగులు చేసిన తిలక్ వర్మ ‘ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్’గా నిలిచాడు.మ్యాచ్ అనంతరం తిలక్ వర్మ మాట్లాడుతూ, తన అద్భుత ఇన్నింగ్స్ వెనుక ఉన్న స్ఫూర్తిని వెల్లడించాడు. “ఈ రోజు ఆటకు ముందు, నేను కోచ్ గౌతమ్ గంభీర్ సర్, బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ సర్‌తో మాట్లాడాను. వారు నాతో ఒక్కటే చెప్పారు, ‘మేమంతా నిన్ను నమ్ముతున్నాం, యావత్ భారత్ నిన్ను నమ్ముతోంది. నువ్వు ఆఖరి వరకు క్రీజులో ఉంటే, కచ్చితంగా మ్యాచ్ గెలిపిస్తావు’ అని. వారి మాటలే నా మదిలో మెదిలాయి. అందుకే ఆటను వీలైనంత ముందుకు తీసుకెళ్లాలనుకున్నాను” అని తిలక్ వివరించాడు.ఒక దశలో 10.5 ఓవర్లకు 70 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి భారత్ తీవ్ర కష్టాల్లో పడింది. ఆ సమయంలో క్రీజులోకి వచ్చిన తిలక్ వర్మ, ముందుగా నమన్ ధీర్ (17 బంతుల్లో 31)తో కలిసి ఆరో వికెట్‌కు 42 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. నమన్ ఔటైన తర్వాత, మరో తెలుగు ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డి (13 బంతుల్లో 26 నాటౌట్) క్రీజులోకి వచ్చాడు.ఇద్దరు తెలుగు ఆటగాళ్లు కలిసి కివీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. ఓటమి ఖాయమనుకున్న దశ నుంచి అద్భుతమైన భాగస్వామ్యంతో జట్టును విజయతీరాలకు చేర్చారు. వీరిద్దరూ కలిసి అజేయంగా 69 పరుగులు జోడించి, మరో బంతి మిగిలి ఉండగానే భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించారు. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2-0 ఆధిక్యంలో నిలిచింది. మ్యాచ్ తర్వాత “నితీశ్ రెడ్డి, నేను.. కలిసి మ్యాచ్‌ను ముగించడం చాలా ఆనందంగా ఉంది” అని తిలక్ చెప్పడం విశేషం.

ఓ వైపు ఆర్థికమాంద్యం మరో వైపు ఏఐతో ఉద్యోగాల ముప్పు

భవిష్యత్తు సంక్షోభంపై గోల్డ్‌మన్ సాక్స్..



గత రెండేళ్లుగా ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ సాంకేతికత శ్రామిక శక్తిపై చూపే ప్రభావంపై తీవ్ర చర్చ జరుగుతోంది. ప్రస్తుతానికి ఉద్యోగాలపై ఏఐ ప్రభావం తక్కువగానే కనిపిస్తున్నప్పటికీ.. భవిష్యత్తులో వచ్చే ఆర్థిక మాంద్యం సమయంలో ఏఐ వల్ల భారీ ఎత్తున ఉద్యోగాల కోత వేగవంతమయ్యే ప్రమాదముందని దిగ్గజ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ ‘గోల్డ్‌మన్ సాక్స్’ తన నూతన పరిశోధనా నివేదికలో సంచలన విషయాలను వెల్లడించింది. గోల్డ్‌మన్ సాక్స్ సీనియర్ ఆర్థికవేత్త జోసెఫ్ బ్రిగ్స్ రూపొందించిన ఈ విశ్లేషణ ప్రకారం.. అమెరికా, ఇతర అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలలో ఏఐ సాంకేతికత ఉత్పాదకతను సుమారు 15 శాతం వరకు పెంచుతుందని అంచనా వేశారు. అయితే ఈ పరివర్తన కాలంలో దాదాపు 9 శాతం మంది కార్మికులు (అంటే ప్రతి 11 మందిలో ఒకరు) తమ ఉద్యోగాలను కోల్పోయే ప్రమాదం ఉంది. దీనికి తోడు కంపెనీలు కొత్త నియామకాలను నెమ్మదించడం వల్ల ఉపాధిపై అదనంగా మరో 3 శాతం మేర ప్రతికూల భారం పడనుందని విశ్లేషించారు. దశాబ్ద కాల వ్యవధిలో కేవలం అమెరికాలోనే దాదాపు 1.5 కోట్ల (15 మిలియన్ల) మంది కార్మికులు దీని వల్ల తీవ్ర ప్రభావానికి లోనవుతారని స్పష్టం చేశారు. సాంకేతిక మార్పులు, కార్మిక మార్కెట్ల చరిత్రను పరిశీలిస్తే ఒక స్పష్టమైన నమూనా కనిపిస్తుందని జోసెఫ్ బ్రిగ్స్ వివరించారు. ఆర్థిక వ్యవస్థ బలంగా ఉన్న సమయంలో కంపెనీలు ఉద్యోగాలను తగ్గించడానికి అంతగా ఆసక్తి చూపవు. కానీ, వ్యాపార మందగమనం లేదా ఆర్థిక మాంద్యం ఏర్పడినప్పుడు కంపెనీలు తమ నిర్వహణ వ్యయాలను తగ్గించుకోవడానికి ఉద్యోగులను తొలగించి, ఆ స్థానంలో వేగంగా ఆటోమేషన్, ఏఐ సాంకేతికతలను ప్రవేశపెడతాయి. 1980ల ప్రారంభంలో వచ్చిన మాంద్యం, 2001 డాట్ కామ్ బబుల్, 2008 గ్లోబల్ ఫైనాన్షియల్ సంక్షోభం మరియు 2020 మహమ్మారి సమయంలో ఆటోమేషన్ వల్ల సాధారణ ఉద్యోగాలు గణనీయంగా తుడిచిపెట్టుకుపోవడమే ఇందుకు నిదర్శనమని నివేదిక ఎత్తిచూపింది. రాగిని ఇప్పుడే కొనిపెట్టుకోండి.. భవిష్యత్తులో చేతికి చిక్కదంటున్న గోల్డ్‌మన్ సాక్స్.. గతంలో సాంకేతిక పరిణామాల వల్ల ప్రభావితమైన 25 విభిన్న రకాల వృత్తుల డేటాను పరిశీలిస్తే, జాతీయ నిరుద్యోగ రేటులో ప్రతి 1 శాతం పెరుగుదలకు, సదరు వృత్తుల్లో ఐదేళ్ల కాలంలో అదనంగా 4 శాతం ఉద్యోగాలు క్షీణించాయని బ్రిగ్స్ కనుగొన్నారు. ఈ విశ్లేషణ అక్టోబర్ 2025లో గోల్డ్‌మన్ సాక్స్ విశ్లేషకులు దేవిడ్ మెరికల్, పియర్‌ఫ్రాన్సెస్కో మే వెల్లడించిన “ఉద్యోగాలు లేని వృద్ధి” హెచ్చరికలను పునరుద్ఘాటిస్తోంది. ఏఐ సంబంధిత ఉద్యోగ కోతల భయాలు ఇటీవల తగ్గుముఖం పట్టడానికి ప్రధాన కారణం ఏఐ స్వీకరణ ఇంకా ప్రారంభ దశలోనే ఉండటమేనని చెప్పవచ్చు. ప్రస్తుతం అమెరికాలోని కంపెనీలలో కేవలం 23 శాతం మాత్రమే ఏఐని తమ రోజువారీ సాధారణ పనివిధానంలో చేర్చాయి. అంతేకాకుండా, ప్రస్తుతానికి కార్మిక మార్కెట్ స్థిరంగా ఉండటంతో కంపెనీలు తీవ్రమైన ఉద్యోగ కోతలకు పూనుకోవడం లేదు. ఛాలెంజర్ నివేదికల ప్రకారం ఏఐ ఆధారిత ఉద్యోగ కోతలు తగ్గడం, మీడియా కవరేజ్ పడిపోవడం దీనికి సంకేతం. అయితే ఈ ప్రశాంతత తాత్కాలికమేనని, భవిష్యత్తులో వచ్చే ఏకైక చక్రీయ ఆర్థిక మందగమనం లేదా మాంద్యం కంపెనీల ఆటోమేషన్ ప్రయత్నాలను ఒక్కసారిగా వేగవంతం చేసి, ఏఐ-ఆధారిత శ్రామిక శక్తి అంతరాయం యొక్క అత్యంత తీవ్రమైన దశను ప్రారంభించవచ్చని గోల్డ్‌మన్ సాక్స్ ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు.

భారత్‌కు విజయ ‘తిలకం’.. రెండో టీ20లోనూ టీమిండియా అద్భుత విజయం



టీమిండియాకు ఓటమి తప్పదనుకున్న వేళ తెలుగు కుర్రాళ్లు అదరగొట్టారు. ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డితో కలిసి భారత వైస్ కెప్టెన్ తిలక్ వర్మ అద్భుతం చేశాడు. చివరి ఓవర్లలో మెరుపు బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పి న్యూజిలాండ్‌పై టీమిండియాకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. క్రైస్ట్‌చర్చ్‌లోని హేగ్లీ ఓవల్ వేదికగా శనివారం జరిగిన రెండో టీ20లో న్యూజిలాండ్ నిర్దేశించిన 181 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత జట్టు మధ్యలో తడబడినా.. తిలక్, నితీశ్ పోరాటంతో విజయాన్ని అందుకుంది. టాస్ గెలిచిన భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బౌలింగ్ ఎంచుకున్నాడు. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 180 పరుగులు చేసింది. ఆరంభంలో భారత బౌలర్లు పైచేయి సాధించారు. టిమ్ సీఫెర్ట్ (7), డారిల్ మిచెల్ (6), ఫిన్ అలెన్ (16) త్వరగా వెనుదిరిగారు. అర్ష్‌దీప్ సింగ్ రెండు వికెట్లు తీయగా.. ప్రిన్స్ యాదవ్, భువనేశ్వర్ కుమార్, నితీశ్ కుమార్ రెడ్డి చెరో వికెట్ పడగొట్టారు. అయితే గ్లెన్ ఫిలిప్స్, బెవాన్ జాకబ్స్ భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నారు. ఫిలిప్స్ 43 బంతుల్లో 70 పరుగులు చేయగా, జాకబ్స్ 46 బంతుల్లో 58 పరుగులతో రాణించాడు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 116 పరుగులు జోడించి న్యూజిలాండ్‌ను పటిష్ఠ స్థితికి చేర్చారు. చివర్లో మైకేల్ బ్రేస్‌వెల్ రెండు బంతుల్లోనే 10 పరుగులు చేయడంతో ఆతిథ్య జట్టు 180 పరుగుల స్కోరు సాధించింది.181 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. సంజూ శాంసన్ (14), వైభవ్ సూర్యవంశీ (4) త్వరగా ఔటయ్యారు. అభిషేక్ శర్మ (27), శ్రేయస్ అయ్యర్ (7) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు. దీంతో భారత్ పరుగుల కోసం ఇబ్బంది పడింది. కీలక సమయంలో వికెట్లు కోల్పోవడంతో మ్యాచ్ న్యూజిలాండ్ చేతుల్లోకి వెళ్లినట్లు కనిపించింది. ఆ సమయంలో తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి (26 నాటౌట్) బాధ్యత తీసుకున్నారు. తిలక్ (51 నాటౌట్: 6 ఫోర్లు, 1 సిక్స్) తనదైన శైలిలో బౌండరీలు బాదుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించగా, నితీశ్ భారీ షాట్లతో అతడికి అండగా నిలిచాడు. చివరి ఓవర్లలో వీరిద్దరి దూకుడుతో భారత్ విజయానికి చేరువైంది. చివరి ఓవర్‌కు ముందు 10 పరుగులు అవసరమైన దశలోనూ ఒత్తిడికి లోనుకాకుండా ఆడిన ఈ జోడీ లక్ష్యాన్ని అందుకుంది. ఈ విజయంతో భారత్ ఐదు టీ20ల సిరీస్‌లో 2-0 ఆధిక్యాన్ని అందుకుంది. తొలి మ్యాచ్‌లోనూ న్యూజిలాండ్ నిర్దేశించిన భారీ లక్ష్యాన్ని ఛేదించిన టీమిండియా, రెండో మ్యాచ్‌లోనూ ఒత్తిడిని తట్టుకుని గెలవడం విశేషం. కీలక సమయంలో తెలుగు కుర్రాళ్లు తిలక్ వర్మ చూపిన పోరాటం, నితీశ్ రెడ్డి ఇచ్చిన సహకారం భారత విజయానికి ప్రధాన బలంగా నిలిచాయి.

స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లకు బిగ్ అలర్ట్

వచ్చే వారం షేర్ల కొనుగోలుపై నిపుణులు కీలక సూచన..



భారత ఈక్విటీ మార్కెట్లు అక్టోబర్ 23, శుక్రవారం నాటి అంతిమ ట్రేడింగ్‌లో తీవ్రమైన విక్రయాల ఒత్తిడికి గురయ్యాయి. వరుసగా నాల్గవ సెషన్‌లోనూ పతనాన్ని కొనసాగిస్తూ ప్రధాన సూచీలు నష్టాలతో ట్రేడింగ్‌ను ముగించాయి. ఇంట్రాడేలో ఒక దశలో నిఫ్టీ 22,400 స్థాయికి దిగువకు జారినప్పటికీ.. చివరి నిమిషంలో కోలుకుని 22,600 మార్కు వద్ద స్థిరపడగలిగింది.సెషన్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 125.56 పాయింట్లు (0.17 శాతం) తగ్గి 73,123.83 వద్ద ముగియగా.. నిఫ్టీ 87.65 పాయింట్లు (0.39 శాతం) క్షీణించి 22,600.00 వద్ద నిలిచింది. అయితే, రోజు కనిష్ట స్థాయిలతో పోలిస్తే సెన్సెక్స్ 670 పాయింట్లు, నిఫ్టీ 228 పాయింట్లు మేర కోలుకోవడం కొంత ఊరటనిచ్చే అంశంగా చెప్పుకోవచ్చు. వారపు ప్రాతిపదికన చూస్తే సెన్సెక్స్ 2 శాతం (1,575 పాయింట్లు), నిఫ్టీ 2.35 శాతం నష్టపోయి తమ రెండు వారాల లాభాల పరంపరకు ముగింపు పలికాయి. విస్తృత మార్కెట్లలో పతనం మరింత ఘోరంగా ఉంది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ ఈ వారంలో దాదాపు 6 శాతం కుప్పకూలింది. ఇది అక్టోబర్ 2024 తర్వాత దారుణమైన వారపు నష్టం కాగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 7 శాతానికి పైగా పడిపోయి ఫిబ్రవరి 2025 తర్వాత అతిపెద్ద పతనాన్ని చవిచూసింది. పశ్చిమ ఆసియాలో రోజురోజుకూ ముదురుతున్న యుద్ధ మేఘాలు, బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు $115 మార్కుకు చేరడం దేశీయ మార్కెట్లను కుదిపేసింది. అధిక చమురు ధరల వల్ల దిగుమతుల ద్రవ్యోల్బణం పెరిగి కార్పొరేట్ కంపెనీల మార్జిన్లు దెబ్బతింటాయన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వచ్చే వారం మార్కెట్ మరింత పడిపోతుందా.. అమెరికా షేర్ల పతనంతో పెరుగుతున్న టెన్షన్.. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల నిరంతర అమ్మకాలు సెంటిమెంట్‌ను మరింత దిగజార్చాయి. ఐటీ స్టాక్స్ సానుకూల త్రైమాసిక అంచనాలతో రాణించినప్పటికీ, మెటల్, రియల్టీ, డిఫెన్స్, కెమికల్, ఎనర్జీ రంగాలు అత్యధికంగా 7 శాతం వరకు పతనమై సూచీలపై తీవ్ర ఒత్తిడి తెచ్చాయి. మార్కెట్ నిపుణుల సాంకేతిక విశ్లేషణ ప్రకారం.. వరుస పతనాల తర్వాత నిఫ్టీ ప్రస్తుతం 22,200-22,400 వద్ద ఉన్న కీలక మద్దతు జోన్‌కు చేరింది. ఒకవేళ ఈ స్థాయి విఫలమైతే నిఫ్టీ 21,700 వరకు పడిపోయే ప్రమాదం ఉంది. పైకెళ్లే క్రమంలో 22,900 పైన నిలదొక్కుకుంటేనే 23,300 వైపు పుల్‌బ్యాక్ ర్యాలీ సాధ్యమవుతుంది. హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ నిపుణుల ప్రకారం.. శుక్రవారం నాటి రోజువారీ చార్టులో భారీ బేర్ క్యాండిల్ ఏర్పడింది. గురువారం నాటి డోజీ ప్యాటర్న్ కనిష్ట స్థాయి 22,554ని దాటడంతో స్వల్పకాలిక ట్రెండ్ ప్రతికూలంగా మారింది. ప్రస్తుతం 22,200-22,300 స్థాయిలు మద్దతుగా పనిచేస్తుండగా, 22,800 వద్ద బలమైన నిరోధకత ఎదురవుతోంది. కోటక్ నియో టెక్నికల్ రీసెర్చ్ విశ్లేషణ ప్రకారం.. తక్షణ నిరోధక జోన్‌గా ఉన్న 20-రోజుల మూవింగ్ యావరేజ్ (నిఫ్టీకి 22,700 / సెన్సెక్స్‌కు 73,700) దాటితేనే పుంజుకునే అవకాశం ఉంది. అలా జరిగితే 23,000-23,200 / 74,000-74,600 స్థాయిలకు చేరుకోవచ్చు. లేదంటే మళ్లీ 22,200-22,400 / 72,800-73,400 స్థాయిలకు పడిపోవచ్చు. బ్యాంక్ నిఫ్టీకి 55,000 కీలక స్థాయి కాగా, దానికంటే దిగువకు పడిపోతే 53,200 వరకు జారే ప్రమాదం ఉంది. ప్రస్తుత అస్థిరత దృష్ట్యా ట్రేడర్లు రిస్క్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టాలని, దీర్ఘకాలిక ఇన్వెస్టర్లు బలమైన లార్జ్-క్యాప్ స్టాక్స్‌ను విడతల వారీగా కొనుగోలు చేయవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

ఒక్క ఓవర్ చాలు.. మ్యాచ్ మనవైపు తిప్పుకోవచ్చని నమ్మాం: నితీశ్ కుమార్ రెడ్డి



న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో ఒక్క భారీ ఓవర్ వస్తే చాలు, మ్యాచ్ ఫలితాన్ని మనవైపు తిప్పుకోవచ్చనే బలమైన నమ్మకంతోనే తాము ఆడామని భారత యువ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి వెల్లడించాడు. శనివారం హేగ్లీ ఓవల్ మైదానంలో జరిగిన ఉత్కంఠభరిత పోరులో, ఓటమి అంచున ఉన్న టీమిండియాను తిలక్ వర్మతో కలిసి నితీశ్ అద్భుత భాగస్వామ్యంతో విజయతీరాలకు చేర్చాడు. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.181 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్, ఒకానొక దశలో 70 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆపై 15వ ఓవర్లో నమన్ ధీర్ కూడా పెవిలియన్ చేరడంతో టీమిండియా ఓటమి ఖాయమనిపించింది. ఆ క్లిష్ట సమయంలో క్రీజులోకి వచ్చిన నితీశ్ (26లి), తిలక్ వర్మతో (51లి) కలిసి మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. ఈ తెలుగు ఆటగాళ్ల ద్వయం ఏడో వికెట్‌కు కేవలం 30 బంతుల్లోనే 69 పరుగుల అజేయ భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్ తరఫున ఏడో వికెట్‌కు ఇదే అత్యధిక భాగస్వామ్యం కావడం విశేషం.మ్యాచ్ అనంతరం నితీశ్ మాట్లాడుతూ, “నేను క్రీజులోకి వచ్చినప్పుడు మా ఇద్దరి మధ్య ఒకటే చర్చ జరిగింది. ఒక్క భారీ ఓవర్ పడితే చాలు, ఒత్తిడి మొత్తం బౌలర్ల వైపు మళ్లుతుందని మేం బలంగా నమ్మాం. టీ20 ఫార్మాట్‌లో అదే కీలకం. వికెట్ల మధ్య చురుగ్గా పరుగెత్తాం, మంచి బంతులకు కూడా రెండు పరుగులు తీశాం. చెత్త బంతులను బౌండరీలకు తరలించాం. దీంతో బౌలర్లు ఒత్తిడికి గురవడం మేం గమనించాం. అక్కడే మ్యాచ్ మా చేతుల్లోకి వచ్చింది” అని వివరించాడు.చివరి ఐదు ఓవర్లలో 68 పరుగులు అవసరమైన దశలో, 18వ ఓవర్‌లో 17, 19వ ఓవర్‌లో 18 పరుగులు రాబట్టారు. చివరి ఓవర్‌లో 11 పరుగులు అవసరం కాగా, ప్రొఫెషనల్ ఆటతీరుతో నితీశ్ కుమార్ రెడ్డి, తిలక్ వర్మ విజయాన్ని ఖాయం చేశారు. “ఆ సమయంలో ప్రశాంతంగా ఉండటం ముఖ్యం. బౌలర్ ఎలా బౌలింగ్ చేస్తాడో అంచనా వేయాలి. క్రీజులో నిలబడితే సరైన సమయం అదే వస్తుంది. ప్రతిసారీ ఇది జరగకపోవచ్చు, కానీ నమ్మకంతో ఆడాలి” అని నితీశ్ తెలిపాడు.ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ఎలాంటి సందేశం పంపారని అడగ్గా, “గంభీర్ సార్ ఎప్పుడూ ఒకటే చెబుతారు. ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా మనల్ని మనం నమ్ముకోవాలని అంటారు. మేం అదే చేశాం. మాపై ఎలాంటి అదనపు ఒత్తిడి పెట్టలేదు” అని నితీశ్ పేర్కొన్నాడు. ఈ మ్యాచ్‌తో కివీస్ బౌలర్లు మాట్ హెన్రీ, డఫ్ఫీ తమను తీవ్రంగా ఒత్తిడిలోకి నెట్టారని, కానీ చివరికి తాము విజయం సాధించడం ఆనందంగా ఉందని అన్నాడు. ఇరు జట్ల మధ్య మూడో టీ20 అక్టోబర్ 27న వెల్లింగ్‌టన్‌లో జరగనుంది.

వాహనదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న చమురు మంటల సెగలు

పెట్రోల్,డీజిల్ ధరలపై బిగ్ సస్పెన్స్..



పశ్చిమ ఆసియాలో రోజురోజుకూ తీవ్రమవుతున్న సైనిక ఉద్రిక్తతలు, వ్యూహాత్మక జలసంధులలో చమురు ట్యాంకర్లపై వరుస దాడిల పరంపర ప్రపంచ ఇంధన మార్కెట్లను కుదిపేస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు అదుపుతప్పి దాదాపు ఆరు నెలల గరిష్ట స్థాయికి దూసుకెళ్లాయి. సరఫరా వ్యవస్థలకు తీవ్ర అంతరాయం కలుగుతుందన్న ఆందోళనల మధ్య ఇన్వెస్టర్లలో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. శుక్రవారం నాటి ట్రేడింగ్ ముగింపు సమయానికి అంతర్జాతీయ బెంచ్‌మార్క్ అయిన బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ బ్యారెల్‌కు $3.55 పెరిగి (3.14% వృద్ధితో) $116.72 వద్ద ముగిసింది. గతేడాది ఏప్రిల్ తర్వాత ఈ స్థాయిలో ధరలు నమోదుకావడం ఇదే ప్రథమం. అమెరికాకు చెందిన వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ ముడి చమురు ధర 3.8% ($3.80) బలపడి బ్యారెల్‌కు $103.27కు చేరుకుంది. ఈ వారంలో మొత్తం మీద బ్రెంట్ చమురు సుమారు 6% మేర ఎగబాకడం గమనార్హం. సౌదీ అరేబియా సహా గల్ఫ్ జలాల్లో ఇరాన్ మద్దతు ఉన్న హౌతీ తిరుగుబాటుదారులు దాడులను తీవ్రతరం చేయడమే ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. సౌదీ రాజధాని రియాద్‌ను లక్ష్యంగా చేసుకుని ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణులను, డ్రోన్లను కూల్చివేసినట్లు సౌదీ సంకీర్ణ దళాలు వెల్లడించాయి. మరోవైపు భద్రతా కారణాల దృష్ట్యా ధహ్రాన్‌లోని తమ ప్రధాన కార్యాలయాన్ని ఖాళీ చేసి రిమోట్‌గా పనిచేయాల్సిందిగా చమురు దిగ్గజం ‘సౌదీ అరామ్కో’ సిబ్బందిని ఆదేశించింది. ప్రపంచ చమురు రవాణాకు జీవనాడి లాంటి హోర్ముజ్, బాబ్-ఎల్-మండేబ్ జలసంధులలో వరుస నౌకా దాడులు, నౌకలపై మందుపాతరల పేలుళ్లు షిప్పింగ్ రంగంలో కలవరం సృష్టిస్తున్నాయి. ఇటీవల రెండు భారీ ఆయిల్ సూపర్‌ట్యాంకర్లు మందుపాతరలను ఢీకొనడంతో భారీగా చమురు లీకై సముద్ర తీర ప్రాంతాలు మూతపడినట్లు నివేదికలు హెచ్చరిస్తున్నాయి. పెట్రోల్, డీజిల్ ధరల బాదుడు తప్పదా.



సాయిదుర్గ తేజ్ కొత్త సినిమాలో 'కాంతార' బ్యూటీ..

అటవీ నేపథ్యంలో భారీ యాక్షన్ డ్రామా!

మెగా సుప్రీం హీరో సాయిదుర్గా తేజ్ వరుసగా విభిన్న కథాంశాలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పలు వైవిధ్యమైన చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న ఆయన.. ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు సమాచారం. దర్శకుడు తేజ కాకుమాను తెరకెక్కించనున్న ఈ సినిమాను నిర్మాత అనిల్ సుంకర నిర్మించనున్నారు. అటవీ నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం రూపొందనుందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. సాయిదుర్గా తేజ్, తేజ కాకుమాను కాంబినేషన్‌లో రానున్న ఈ కొత్త సినిమా కథాంశంపై ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో అడవి నేపథ్యంలో సాగే సన్నివేశాలు, భారీ యాక్షన్ ఎపిసోడ్లు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని సమాచారం. గ్రాఫిక్స్, విజువల్ ఎఫెక్ట్స్‌కు కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని, ఈ నెలాఖరులో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించే యోచనలో చిత్రబృందం ఉన్నట్లు సమాచారం. అయితే షూటింగ్ ప్రారంభ తేదీ, కథాంశానికి సంబంధించిన పూర్తి వివరాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ సినిమాలో సాయిదుర్గా తేజ్‌కు జోడీగా కన్నడ నటి సప్తమి గౌడ నటించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. 'కాంతార' చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఆమె.. ఈ సినిమాలో కథానాయికగా ఎంపికైనట్లు ప్రచారం జరుగుతోంది. అయితే చిత్రబృందం నుంచి పూర్తి క్లారిటీ రావాల్సి ఉంది. సప్తమి గౌడ గతంలో నితిన్ నటించిన 'తమ్ముడు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. అలాగే హిందీ చిత్రం 'ది వ్యాక్సిన్ వార్'లోనూ నటించారు. కన్నడ చిత్ర పరిశ్రమలో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న ఆమెకు సాయిదుర్గా తేజ్ సరసన అవకాశం వస్తే, అది ఆమె కెరీర్‌కు మరో ముఖ్యమైన ప్రాజెక్ట్‌గా నిలిచే అవకాశం ఉంది. మరోవైపు సాయిదుర్గా తేజ్ నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'సంబరాల ఏటిగట్టు'పై కూడా అంచనాలు ఉన్నాయి. రోహిత్ కేపీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ చిత్రాన్ని ప్రైమిషో ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్మిస్తోంది. కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.

నవంబర్ 1న ఆర్‌సీ17 పూజా కార్యక్రమాలు

గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ మరియు క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో వస్తున్న ప్రాజెక్ట్ ఆర్‌సీ 17 ఇండస్ట్రీలో సంచలనాత్మక విజయాలను నమోదు చేసిన 'రంగస్థలం' చిత్రం తర్వాత ఈ క్రేజీ కాంబో మరోసారి రిపీట్ అవుతుండటంతో సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ఈ సినిమా ఎప్పుడు ప్రారంభమవుతుందా అని మెగా అభిమానులు మరియు సినీ ప్రియులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న తరుణంలో, ఎట్టకేలకు మేకర్స్ నుంచి మోస్ట్ ఎవైటెడ్ అఫీషియల్ అప్‌డేట్ వచ్చేసింది. ఈ భారీ ప్రాజెక్ట్‌ను మొదటగా దసరా పండుగ రోజునే ఆత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలతో లాంచ్ చేయాలని చిత్ర యూనిట్ భావించింది. అయితే ఆ సమయంలో ముహూర్తం సరిపడకపోవడం మరియు కొన్ని సాంప్రదాయ కారణాలరీత్యా ఈ ఓపెనింగ్ కార్యక్రమాన్ని కొద్దిరోజులు వాయిదా వేయాల్సి వచ్చింది. ఆ తర్వాత అక్టోబర్ చివరి వారంలో ఈ సినిమా లాంఛింగ్ ఉంటుందని మైత్రీ మూవీ మేకర్స్ సహ నిర్మాత వై.రవిశంకర్ గతంలో హింట్ ఇచ్చిన విషయం తెలిసిందే. తాజాగా జరిగిన ఒక మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సినిమా పూజా కార్యక్రమాలకు సంబంధించిన ఖచ్చితమైన తేదీని అధికారికంగా రివీల్ చేశారు. వచ్చే నెల నవంబర్ 1వ తేదీన ఎంతో గ్రాండ్‌గా ఆర్‌సీ 17 పూజా కార్యక్రమాలను నిర్వహించి ఈ చిత్రాన్ని అధికారికంగా లాంచ్ చేయబోతున్నట్లు ఆయన స్పష్టం చేశారు. కేవలం పూజతో సరిపెట్టకుండా, లాంఛింగ్ పూర్తయిన వెంటనే ఏ మాత్రం ఆలస్యం చేయకుండా రెగ్యులర్ షూటింగ్ పనులను కూడా శరవేగంగా ప్రారంభించేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. సుకుమార్ మార్క్ మేకింగ్, రామ్‌చరణ్ గ్లోబల్ ఇమేజ్ తోడవుతుండటంతో ఈ సినిమా ఏకంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాయడం ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఎట్టకేలకు సినిమా ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారు కావడంతో మెగా అభిమానులు ప్రస్తుతం ఫుల్ ఖుషి అవుతున్నారు మరియు సోషల్ మీడియాలో ఈ అప్‌డేట్‌ను ట్రెండ్ చేస్తున్నారు.



సూర్య సినిమా కోసం 'కల్ట్' టైటిల్ అడిగారు.. కానీ నేను ఇవ్వలేదు విశ్వక్ సేన్



టాలీవుడ్ మాస్ కా దాస్ విశ్వక్ సేన్ తాజాగా నటిస్తూ, స్వయంగా దర్శకత్వం వహిస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ కల్ట్. ఈ సినిమా టైటిల్‌కు సంబంధించి తాజాగా ఓ ఆసక్తికరమైన వార్త టాలీవుడ్ వర్గాల్లో తెగ చక్కర్లు కొడుతోంది. కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటించబోయే ఒక భారీ సినిమా కోసం చిత్ర యూనిట్ సభ్యులు ముందుగా ఈ 'కల్ట్' టైటిల్‌ను తమకు ఇవ్వాలని అడిగినట్లు విశ్వక్ సేన్ స్వయంగా వెల్లడించారు. తమ సినిమా కథకు మరియు నేపథ్యానికి ఈ టైటిల్ అత్యంత సరిగ్గా సరిపోతుందని వారు భావించినట్లు ఆయన తెలిపారు. అయితే, ఆ టైటిల్ తన సినిమాలోని పాత్రకు, కథాంశానికి మరింత పర్ఫెక్ట్‌గా సూట్ అవుతుందని గట్టిగా నమ్మడంతో, సూర్య టీమ్ అడిగినప్పటికీ తాను ఆ టైటిల్‌ను ఇవ్వడానికి సున్నితంగా నిరాకరించినట్లు విశ్వక్ సేన్ స్పష్టం చేశారు. అయితే, అది సూర్య నటించబోయే ఏ సినిమాకు సంబంధించిన టైటిల్ అనే దానిపై మాత్రం ఆయన ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. ప్రస్తుతం ఈ ఇంట్రెస్టింగ్ మేటర్ టాలీవుడ్ మరియు కోలీవుడ్ సినీ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారగా, దీనికి సంబంధించిన చర్చలు సోషల్ మీడియాలో జోరుగా సాగుతున్నాయి.

రాముడు, సీత ప్రేమకు సంగీత రూపం..

'రామాయణ' నుంచి 'రంగులు రంగులే' పాట విడుదల!



భారతీయ ఇతిహాసం 'రామాయణం' ఆధారంగా తెరకెక్కుతున్న భారీ చిత్రం నుంచి విడుదలవుతున్న ప్రతి ప్రచార చిత్రం, పాట ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. తాజాగా ఈ చిత్రం నుంచి మూడో పాటగా 'రంగులు రంగులే' విడుదలైంది. శ్రీరాముడు, సీతాదేవి మధ్య ఉన్న ప్రేమానుబంధాన్ని ఆవిష్కరిస్తూ రూపొందించిన ఈ పాట శ్రోతలను ఆకట్టుకుంటోంది. మధురమైన సంగీతం, హృద్యమైన సాహిత్యం, అందమైన దృశ్యాలతో పాటను ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. ఈ పాటకు ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు. ఆయన తనదైన శైలిలో మధురమైన స్వరాలను, ఆకట్టుకునే సంగీత వాయిద్యాలను మేళవించి పాటను రూపొందించారు. గేయ రచయిత రాకేందు మౌళి అందించిన సాహిత్యం రాముడు, సీతల మధ్య ఉన్న అనుబంధాన్ని, వారి భావోద్వేగాలను ప్రతిబింబించేలా ఉంది. రాఘవ్ కౌశిక్, నైశాలి సామంత్ తమ స్వరాలతో పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చారు. 'రంగులు రంగులే' పాటలో రాముడు, సీతల జీవిత ప్రయాణంలోని కీలక ఘట్టాలను చూపించారు. స్వయంవరంలో తొలిసారి కలుసుకోవడం, ఆ తర్వాత వివాహ బంధంతో ఒక్కటవడం, అయోధ్యలో కలిసి గడిపిన మధుర క్షణాలు, అరణ్యవాసానికి బయలుదేరడం వంటి సన్నివేశాలు పాటలో కనిపిస్తాయి. ఈ దృశ్యాల ద్వారా వారి ప్రేమలోని ఆప్యాయత, పరస్పర అనుబంధం, జీవితంలో ఎదురైన కీలక మలుపులను చూపించే ప్రయత్నం చేశారు. రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతాదేవిగా సాయి పల్లవి నటిస్తున్నారు. వీరిద్దరూ తెరపై కనిపించే తీరు, పాత్రలకు అనుగుణంగా వారి హావభావాలు ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. భారీ స్థాయిలో రూపొందుతున్న 'రామాయణ'ను రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. మొదటి భాగాన్ని నవంబరు 5న విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. తాజాగా విడుదలైన 'రంగులు రంగులే' పాట రాముడు, సీతల ప్రేమకథను సంగీత రూపంలో ఆవిష్కరించడంతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది.

M/S ACHUKATLA PUBLICATIONS D.NO. 9/1542, M.R. ROAD, GOOTY RS, ANANTHAPUR, ANDHRA PRADESH - 515402.